PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 347 | విజయవాడ, శనివారం 20 జులై 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 20 July 2024 | Rs

సిటీ

పూర్వ జిల్లాలకు తహసీల్దార్లు


- ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాలకు ఎన్నికల సంఘం బదిలీ చేసిన తహసిల్దార్లను తిరిగి పూర్వ జిల్లాలకు పంపుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం ఈ ఉత్తర్వులు విడుదలయ్యాయి. దీంతో ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది.

అభ్యుదయ రచయిత అడిగోపుల కన్నుమూత

ప్రజాశక్తి- తిరుపతి సిటీ



వెంకటరత్నం (ఫైల్)

ఐదు దశాబ్దాలకుపైగా సాహితీ రంగంలో రాణిస్తున్న ప్రముఖ కవి అడిగోపుల వెంకటరత్నం(79) శుక్రవారం తిరుపతిలోని తన స్వగృహంలో కన్నుమూశారు. కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత సమస్యలతో ఆయన బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య పద్మజ. పిల్లలు మాధవి, శ్రీకాంత్, శాంతి ఉన్నారు. నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం కొత్త వంగళ్లులో జన్మించిన ఆయన నెల్లూరు జిల్లా గండవరం ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించారు. నాగార్జున విశ్వవిద్యాలయంలో, కావలిలోని జవహర్ భారతిలో కళాశాల విద్య పూర్తి చేశారు. తిరుపతి, చెన్నై ప్రాంతంలో ఇంజనీరింగ్ చదివారు. సివిల్ ఇంజనీర్‌గా రిటైరయ్యారు. ఆయన వెలువరించిన 28 పుస్తకాల్లో 27 కవితా సంపుటాలు, ఒక కథా సంపుటి ఉన్నాయి. ప్రతి సామాజిక సందర్భాన్ని, సంక్షోభాన్ని తన కవిత్వంలో రికార్డు చేస్తూ వచ్చారు. కుందుర్తి, శ్రీశ్రీ, తానా, కరుణశ్రీ, వాసిరెడ్డి, సుంకర, సాహితీరత్న, ప్రతిభా పురస్కారాలను అందుకున్నారు. ఆయన అంత్యక్రియలు స్వగ్రామమైన కొత్త వంగళ్లులో ఆదివారం నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

వణికిన వేలేరుపాడు

- పెద్దవాగు ప్రాజెక్టుకు గండి
- వర్షాలు, వరదలతో విలీన మండలాల ప్రజలు బిక్కుబిక్కు
- పొంగిపొర్లుతున్న వాగులు
- గండిపోచమ్మ ఆలయంలోకి వరద నీరు

పెద్దవాగుకు పడిన గండి



ప్రజాశక్తి- యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం నాడు కూడా తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిశాయి. వర్షపు ధాటికి వరదనీరు పోటెత్తడంతో ఉభయ రాష్ట్రాల సరిహద్దుల్లోని పెద్దవాగు ప్రాజెక్టుకు భారీ గండి పడింది . దీని ప్రభావం ఏలూరు జిల్లాలోని వేలేరుపాడు మండలంపై తీవ్రంగా పడింది. గురువారం రాత్రి ఒక్కసారిగా జరిగిన ఈ సంఘటనతో వేలేరుపాడు చిగురుటాకులా వణికిపోయింది. ఈ మండలంలోని పలు గ్రామాల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. గండిపడటానికి కొద్దిసమయం ముందే వీరు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవడంతో భారీప్రాణనష్టం తప్పింది. మేడిపల్లి, కమ్మరిగూడెం, అల్లూరి నగర్, మాధవరం, రామవరం, గుల్లవాయి వంటి 14 గ్రామాలపై తీవ్ర ప్రభావం పడింది. పలు ఇళ్లు నేలమట్టమయ్యాయి. కరెంటు స్తంభాలు కూలిపోయాయి. దాదాపు మండలం అంతా శుక్రవారం రాత్రికి కూడా కరెంటు సరఫరా పునరుద్ధరణ కాలేదు. పూచిరాల గ్రామంలో వరద ఉధృతికి నీట మునిగిన పశువులు పెద్ద సంఖ్యలో మృతి చెందాయి. వేలేరుపాడు, కుక్కునూరు మండలాలకు వెళ్లే ప్రధాన రహదారులకు గండ్లు పడ్డాయి. కుక్కునూరు, దాచారం మధ్య ఉన్న గుండేటి వాగు అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోవడంతో బెస్తగూడెం, నెమలిపేట, అరసపల్లి, గొమ్ముగూడెం, సీతారామపురం వంటి 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు మండలంలోని నార్లవరం, బోళ్లపల్లి మధ్యగల ఎద్దువాగు వంతెన దెబ్బతిని పది గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. మరోవైపు గోదావరి వరద ఉధృతి పెరుగుతుండటం పోలవరం ప్రాజెక్టు విలీన మండలాల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తోన్న భారీ వర్షాలకు గోదావరి పరవళ్లు తొక్కుతోంది.

పోచమ్మ గండి నుంచి తరలిన 40 కుటుంబాలు

అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం పూడిపల్లి పంచాయతీ గొందూరు గ్రామం వద్ద గండి పోచమ్మ అమ్మవారి ఆలయంలోకి వరద నీరు ప్రవేశించింది. అంతరాలయం వరకూ నీరు మిగతా 8లో

కట్టేసిన పశువులు కట్టేసినట్లుగానే..



వేలేరుపాడు మండలం పూచిరాలలో వరద ఉధృతికి నీట మునిగి మృతి చెందిన పశువులు

అప్రమత్తంగా ఉండండి : సిఎం

రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారయంత్రాంగాన్ని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం వివిధ జిల్లాల కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణశాఖ ద్వారా వర్షాలు, వరదలను అంచనా వేసి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ముందస్తు ప్రణాళికతో పనిచేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. చెరువు కట్టలు, వాగుల్లో ప్రవాహాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. గత ప్రభుత్వంలో ఇష్టానుసారం ఇసుక, మట్టి అక్రమ తవ్వకాల వల్ల గోదావరి కట్టలు బలహీనపడ్డాయని, వీటిపై దృష్టిపెట్టాలని అన్నారు. ఇరిగేషన్, రెవెన్యూశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

మరో రెండు రోజులు భారీ వర్షాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారడంతో రాష్ట్ర వ్యాప్తంగా మరో రెండు రోజులు భారీ వర్షాలు పడనున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. వాయుగుండం ఒడిశాలోని పూరి సమీపంలో తీరం దాటే అవకాశం ఉందన్నారు. వాయుగుండం ప్రభావంతో శనివారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడే అవకాశం వుందన్నారు. అలాగే కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోనూ వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించారు. ఆదివారం నాడు మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.



నీతి ఆయోగ్ అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

ఎఐ హబ్‌గా అమరావతి, విశాఖ

- ప్రణాళికల కోసం నీతి ఆయోగ్‌ను కోరిన సిఎం
- రాష్ట్రంలో ఎఐ విశ్వవిద్యాలయాలు
- విద్యుత్ రంగంలో అనూహ్య మార్పులు
- ప్రజలను సంసిద్ధం చేయాలని సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి, వైజాగ్‌లను ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) హబ్‌లుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నీతి ఆయోగ్ అధికారులను కోరారు. 'వికసిత్ ఆంధ్రప్రదేశ్-2047' విజన్ డాక్యుమెంట్‌పై శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో నీతి ఆయోగ్ సిఇఓ బివిఆర్ సుబ్రహ్మణ్యం తదితరులతో సిఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ యూనివర్శిటీలు ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ఉన్నామని చెప్పారు. రాజధాని నగరం అమరావతితోపాటు విశాఖపట్నం కూడా ఈ యూనివర్శిటీల ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని అన్నారు. దీనివల్ల రానున్న రోజుల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయని తెలిపారు. ప్రభుత్వాలు విజన్‌తో పనిచేయాలని, ఉమ్మడి రాష్ట్రంలో సంస్కరణలు, విజన్‌తో వచ్చిన ఫలితాలను చూశామని తెలిపారు. మానవ వనరుల విషయంలో నైపుణ్యం పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల స్థాయి నుండి యూనివర్శిటీ స్థాయి వరకూ సిలబస్ రూపొందించాలని చెప్పారు. కొత్త టెక్నాలజీ అవకాశాలను అందిపుచ్చుకునే విధానాలు విజన్ డాక్యుమెంట్‌లో ఉండాలని పేర్కొన్నారు. సంపద సృష్టికి దోహదపడే పాలసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. విద్యుత్ రంగంలో కూడా అనూహ్య మార్పులు వస్తాయని, దానికి అనుగుణంగా వ్యవస్థలను, ప్రజలను సిద్ధం చేయాల్సి ఉంటుందని అన్నారు. వినూత్న ఆలోచనతో, టెక్నాలజీని ఉపయోగించుకుని పేదరికం లేని సమాజం సాధించాలని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి నుండి మండల, కుటుంబస్థాయి వరకూ ఒక యూనిట్‌గా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. జనాభా సమతుల్యతపై లోతైన కసరత్తు చేసి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలు తీసుకురావడంతోపాటు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా విధానాలు ఉండాలని పేర్కొన్నారు. సీమలో హార్టికల్చర్ ఆధారిత ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు వస్తే రైతులు లబ్ధిపొందుతారని పేర్కొన్నారు. ఐఐటి, ఐఐఎం, ఐఎస్‌బి వంటి సంస్థలు, మేధావులు, నిపుణులతో చర్చించి అన్ని డాక్యుమెంట్లు సిద్ధం చేయాలని చంద్రబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. అట్టడుగుస్థాయి వ్యక్తి జీవితాన్ని మార్చేలా ప్రభుత్వ విజన్ ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా సంస్కరణల అమలులో తన అనుభవాలను, ఫలితాలను సిఎం వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేష్, పయ్యావుల కేశవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర

22నుంచి అసెంబ్లీ

- నోటిఫికేషన్ విడుదల
- పటిష్టంగా బందోబస్తు : మండలి ఛైర్మన్, శాసనసభ స్పీకర్ ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈనెల 22వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 22వ తేదీ ఉదయం పది గంటలకు సమావేశాలు ప్రారంభమవుతాయని ఈ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అనంతరం శాసనమండలి ఛైర్మన్ కె.మోషేన్‌రాజు, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ఈ విషయం తెలిపారు. అసెంబ్లీలో శుక్రవారం వారు పోలీసు అధికారులతో సమావేశమై, అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మండలి ఛైర్మన్ కె.మోషేన్ రాజు మాట్లాడుతూ ఈ దఫా అసెంబ్లీ సమావేశాలకు 88మంది కొత్తగా ఎన్నికైన శాసనసభ సభ్యులు, తొమ్మిది మంది శాసనమండలి సభ్యులు హాజరవుతున్నారని, వారిని గుర్తించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. అసెంబ్లీ ప్రాంగణం అత్యంత ముఖ్యమైన సెక్యూరిటీ జోన్ అని, ఎవరు బడితే వారు లోనికి ప్రవేశించకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బందికి సకాలంలో తాగునీరు, ఆహారంతోపాటు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు మిగతా 5లో



వియత్నాం కమ్యూనిస్టు పార్టీ చీఫ్

ఎన్‌గుయెన్ ఫు ట్రాంగ్ కన్నుమూత

హనోయ్ : వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి దేశంలోనే అత్యంత శక్తివంతమైన నేత ఎన్‌గుయెన్ ఫు ట్రాంగ్ (80) శుక్రవారం మధ్యాహ్నం కన్ను మూశారు. వృద్ధాప్య సంబంధ సమస్యలో బాధపడుతున్న ఆయనను కాపాడుకోవడానికి ప్రముఖ వైద్య నిపుణులు, వైద్యులు, కుటుంబ సభ్యులు శాయశక్తులా కృషి చేసినా ఫలితం లేకపోయిందని సెంట్రల్ మిలటరీ ఆస్పత్రి నిపుణుల మండలి ఒక ప్రకటనలో తెలిపింది. 2011లో కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ట్రాంగ్ ఎన్నికయ్యారు. అప్పటి నుండి దేశ అధ్యక్షుడిగా కొనసాగుతూ వచ్చిన ఆయన గత మే నేలలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు తో లామ్‌కు ఆ బాధ్యతలు మిగతా 8లో

దాడులపై 24న ఢిల్లీలో ధర్నా

- రాష్ట్రంలో అదుపుతప్పిన శాంతిభద్రతలు
- రాష్ట్రపతి పాలన విధించండి : జగన్‌మోహన్‌రెడ్డి
- వినుకొండలో హత్యకు గురైన కార్యకర్త కుటుంబానికి పరామర్శ



రషీద్ కుటుంబీకులను పరామర్శిస్తున్న జగన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి/ అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ లేదని, ఆటవిక పాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో రెండు రోజుల క్రితం దారుణంగా హత్యకు గురైన వైసిపి కార్యకర్త షేక్ రషీద్ కుటుంబ సభ్యులను శుక్రవారం సాయంత్రం ఆయన పరామర్శించారు. అనంతరం జగన్ మీడియాతో మాట్లాడుతూ ఇష్టారాజ్యంగా హత్యలు చేస్తున్నారని, ఆస్తులు ధ్వంసం చేస్తున్నారని, పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పేదలు, వైసిపి కార్యకర్తలపై జరుగుతున్న దాడులకు నిరసనగా వచ్చే బుధవారం ఢిల్లీలో ధర్నా చేస్తానని ప్రకటించారు. త్వరలో ప్రధాని మోడీని, రాష్ట్రపతిని కలిసి రాష్ట్రంలో పరిస్థితులను వివరిస్తామని తెలిపారు. రాష్ట్రంలో గత 45 రోజుల కాలంలో 490 చోట్ల ప్రభుత్వ ఆస్తులు, 560 చోట్ల ప్రయివేటు ఆస్తులను ధ్వంసం చేశారని, వెయ్యికిపైగా దౌర్జన్యాలు, దాడులు జరిగాయని ఆరోపించారు. 36 హత్యలు జరిగాయని, టిడిపి నేతల వేధింపులకు 35 మంది సామాన్యులు ఆత్మహత్య చేసుకున్నారని, 300కి పైగా హత్యా ప్రయత్నాలు జరిగాయని వివరించారు. అయినా, పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని, నిందితులపై కాకుండా బాధితులపై కేసులు మిగతా 5లో

ఇద్దరు దోషుల పిటిషన్ కొట్టివేత

- బిల్కిస్ బానో కేసులో సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : బిల్కిస్ బానో కేసులో దోషుల శిక్షను తగ్గించడం చెల్లదంటూ జనవరి8న రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు సరికాదంటూ 11 మంది దోషుల్లో ఇద్దరు దాఖలు చేసిన అప్పీలును సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై ఎలా పిటీషన్ వేస్తారనిజస్టిస్ సంజీవ్ ఖన్నా, జసిస్ట్ సంజయ్ కుమార్ ధర్మాసనం పిటిషనర్లను ప్రశ్నించింది. 'అసలు ఈ పిటీషన్ ఎంటి? దీనిన్ని ఎలా విచారణ చేస్తారు. ఇది పూర్తిగా దోషపూరితం. ఆర్టికల్ 32 పిటీషన్ ఎలా ఫైల్ చేస్తారు? మరోక బెంచ్ ఇచ్చిన తీర్పుపై విచారణ చేయడానికి మేం ఇక్కడ కూర్చోలేదు' అని ధర్మాసనం తీవ్రంగా పేర్కొంది. దీంతో దోషులు రాధేశ్యామ్ భగవాన్‌దాస్ షా, రాజుబాయి బాబులాల్ సోని తరుపున ఈ పిటీషన్ వేసిన న్యాయవాది రిషి మెల్హోత్ర ఈ పిల్‌ను ఉపసంహరించుకోవడానికి కోర్టును అనుమతి కోరారు. కోర్టు దీనికి అనుమతించింది. షా మధ్యంతర బెయిల్ కోసం కూడా పిటీషన్ దాఖలు చేశారు.



పూర్వ కమ్యూనిస్టుల కుటుంబాల సమ్మేళనంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

మతోన్మాద శక్తులపై నిరంతర పోరాటం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- పుట్టపర్తి అర్బన్

మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా సిపిఎం నిరంతరం పోరాటం చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన శ్రీసత్యసాయిలో విలేకర్లతో మాట్లాడారు. బిజెపితో జతకట్టిన చంద్రబాబు భవిష్యత్తులో ఎంతమేరకు రాణిస్తారో చూడాల్సి ఉందన్నారు. బిజెపి నిర్ణయాల వల్ల మైనార్టీలు నష్టపోతున్నారని తెలిపారు. టిడిపి లౌకిక పార్టీ అయితే, బిజెపి మతోన్మాద పార్టీ అని అన్నారు. పవన్ కల్యాణ్ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లను సమర్థిస్తున్నారని, భవిష్యత్తులో జనసేన పార్టీకి ఇబ్బందులు తప్పవని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటిందన్నారు. ప్రజలు ఈ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ హామీల అమలుపై తగిన ప్రణాళికలు ప్రకటించాల్సి ఉందన్నారు. పోలవరం, రాజధాని అమరావతి చుట్టూ రాజకీయాలు సాగుతున్నాయని పేర్కొన్నారు. కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం, రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాయని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తేనే అధిక నిధులు వస్తాయని పేర్కొన్నారు. ఎన్‌డిఎలో భాగస్వాగమైన టిడిపి ఈ దిశగా ప్రయత్నించాలని కోరారు. పోలవరం, అమరావతి నిర్మాణాలకు సిపిఎం మద్దతు ఇస్తుందని తెలిపారు. పోలవరం నిర్వాసితుల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీగా వైసిపి కేంద్రం పట్ల తమ వైఖరి ఏమిటో చెప్పాలని కోరారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఆకలి చావులు దేశంలో పెరిగిపోతున్నాయన్నారు. వీటిపై తమ పార్టీ పోరాటాలు చేస్తూనే ఉంటుందని తెలిపారు. కార్పొరేట్లకు ప్రభుత్వాలు వేల కోట్ల మిగతా 5లో

జిఓల్లో పారదర్శకత ఏదీ?
- పునరుద్ధరణకు నోచుకోని జిఓఐఆర్ పోర్టల్
- అప్పట్లో విమర్శించిన టిడిపి నేతలు

సిఎం ముఖ్య కార్యదర్శిగా రాజమౌళి

గాజాపై పెట్రేగిపోతున్న ఇజ్రాయిల్ బలగాలు
- 24 గంటల వ్యవధిలో 54 మంది మృతి

స్వామినాథన్ సిఫారసులు అమలు చేయండి
- ఎంపి శివనాథ్‌కు రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి విజ్ఞప్తి

లోపలి పేజీలో..

ఇంటర్నెట్ ప్రపంచంలో పెద్ద కుదుపు !

- మైక్రోసాఫ్ట్ విండోస్‌లో సాంకేతిక సమస్య
- విమాన, ఆర్థిక, కమ్యూనికేషన్ సహా పలు రంగాలపై తీవ్ర ప్రభావం



న్యూయార్క్/ముంబయి: ఇంటర్నెట్ ప్రపంచంలో పెద్ద కుదుపు. మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాఫ్ట్‌వేర్ బగ్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా పలు చోట్ల వైమానిక, ఆర్థిక, కమ్యూనికేషన్లతో సహా పలు రంగాల సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. క్రౌడ్ స్ట్రైక్‌లో సమస్య తలెత్తి ఆగిపోవడంతో బ్లూ స్క్రీన్‌పై ఎర్రర్ అని చూపిస్తూ షట్‌డౌన్ అవడమో లేదా రీ స్టార్ట్ అవడమో జరిగింది. దీంతో శాన్‌ఫ్రాన్సిస్కో నుండి ఎడిన్‌బరో వరకు ప్రపంచ వ్యాపితంగా వివిధ సేవలు స్తంభించిపోయాయి. రైళ్లు, విమానాల , బ్యాంకులు, సూపర్ మార్కెట్లు, హెల్త్ కేర్ వంటి సేవలకు తీవ్ర అంతరాయమేర్పడింది.. మరీ ముఖ్యంగా భారత్‌లో ఢిల్లీ, కొలకతా, హైదరాబాద్ వంటి పలు నగరాల్లో పౌర జీవనం అస్తవ్యస్థమైంది. స్పైస్ జెట్, ఇండిగో, ఎయిరిండియా, విస్తారా, అకాశ ఎయిర్‌వేస్‌లో బుకింగ్, చెక్‌ఇన్ సేవలు కొన్ని గంటల పాటు స్తంభించిపోయాయి. కొల్‌కతాలోని సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సర్వీసులు స్తంభించిపోయాయి. దీంతో కొన్ని విమాన సర్వీసులు రద్దయ్యాయి. విమానాల రాకపోకల వేళలను సవరించారు. చేతితో రాసిన బోర్డింగ్ పాస్‌లను ప్రయాణీకులకు ఇచ్చారు 10 బ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సిలు స్వల్పంగా అంతరాయాలను ఎదుర్కొన్నాయని ఆర్‌బిఐ ప్రకటించింది. క్రౌడ్ స్ట్రైక్‌లో సాంకేతిక సమస్య వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. క్రౌడ్‌స్ట్రయిక్ అనేది టెక్సాస్‌లోని ఆస్టిన్ కేంద్రంగా పనిచేస్తున్న సైబర్ సెక్యూరిటీ సంస్థ. ఇది రూపొందించిన యాంటీ సైబర్ ఎటాక్ సాఫ్ట్‌వేర్‌ను మైక్రో సాఫ్ట్ విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌లో నేరుగా పొందుపరచడం వల్ల క్రౌడ్ స్ట్రయిక్ సాఫ్ట్‌వేర్‌లో తలెత్తిన బగ్ వల్ల ఈ అంతరాయమేర్పడినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు 365 మిగతా 5లో

సిఎం ముఖ్య కార్యదర్శిగా రాజమౌళి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఎం చంద్రబాబు ముఖ్య కార్యదర్శిగా ఉత్తరప్రదేశ్ కేడర్‌కు చెందిన ఐఎఎస్ అధికారి ఎవి రాజమౌళి (2003 బ్యాచ్)ని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం జిఒ ఆర్‌టి నెంబరు 1238ను విడుదల చేసింది. కేంద్ర సర్వీసుల నుంచి ఈ నెల 18న రాజమౌళి రిలీవ్ అయ్యారు. మూడేళ్లపాటు డిప్యుటేషన్‌పై ఆయన పనిచేయనున్నారు. 2015-19 మధ్యకాలంలో టిడిపి అధికారంలో ఉండగా, రాజమౌళి సిఎం కార్యదర్శిగా సిఎంఒలో పనిచేశారు.

చిరుద్యోగులపై వేధింపులు

- రాజీనామా చేయాలంటూ ఒత్తిళ్లు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల చేత రాజీనామాలు చేయించి, వారి స్థానంలో తమ పార్టీకి చెందిన వారిని నియమించుకోవాలనే ఉద్దేశంతో టిడిపి నాయకులు వేధింపులకు పాల్పడుతున్నారు. జిల్లాలోని 32 మండలాల పరిధిలో దాదాపు వెయ్యి మందికి పైగా చిరుద్యోగులతో రాజీనామాలు చేయించాలని నెల రోజులుగా వేధింపులకు పాల్పడుతున్నారు. ఒక్క శ్రీకాళహస్తి నియోజకవర్గంలోనే 37 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. తమ మాట వినకపోతే ఊరి నుంచి వెలివేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ, ఆశా, సంఘమిత్ర, మధ్యాహ్న భోజన కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు వంటి స్కీమ్ వర్కర్లపై టిడిపి నాయకులు రాజకీయ వేధింపులను మానుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి కోరారు. ఇలాంటి వాటికి స్వస్తి చెప్పకపోతే కార్మికులందర్నీ ఐక్యం చేసి పోరుబాట పడతామని హెచ్చరించారు.

రషీద్ హత్యకు జగనే కారణం

- మంత్రి డోలా ఆరోపణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వినుకొండలో జరిగిన రషీద్ హత్యకు ముఖ్య కారకుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి ఆరోపించారు. వైసిపి హయాంలోనే రషీద్, నిందితుడు జిలానీ మధ్య జరిగిన గొడవలపై చర్యలు తీసుకుని ఉంటే హత్య జరిగేదా? అని శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఇప్పటికైనా శవ రాజకీయాలు మానుకోకపోతే జగన్‌కు ప్రజలే శాశ్వతంగా రాజకీయాలు మానిపిస్తారని అన్నారు.

పాఠశాలల్లో ఆదివారాలు కార్యక్రమాలొద్దు: టిఎన్‌యుఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాలల్లో ఆదివారాలు ఎలాంటి కార్యక్రమాలూ నిర్వహించొద్దని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టిఎన్‌యుఎస్) కోరింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామిశెట్టి వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సామాజిక భాగస్వామ్య దినోత్సవం పేరుతో తల్లిదండ్రులు కమిటీలు, స్థానిక ప్రజలు, ఉపాధ్యాయ సంఘాలతో సహకారం పెంపొందించడం, పుట్టిన రోజులకు సహపంక్తి భోజనాలు అనే కార్యక్రమం నిర్వహించాలని సమగ్రశిక్షా డైరెక్టరు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఉపాధ్యాయ పనిభారం, విద్యార్థుల మానసిక స్థితి దృష్ట్యా ఆదివారాలు కార్యక్రమాలు తదుపరి సోమవారం జరిపేలా రీషెడ్యూల్ చేయాలని కోరారు. పాఠశాలల్లో తల్లిదండ్రుల కొత్త కమిటీలు ఏర్పాటు చేయాలని సమగ్రశిక్షా ఎస్‌పిడిని లేఖ ద్వారా కోరారు. ఏడాది క్రితమే కమిటీలకు కాలం చెల్లిందని అన్నారు.

అప్పుడు ఎందుకు స్పందించలేదు

- జగన్‌కు పురందేశ్వరి ప్రశ్న

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలో చాలా దారుణాలు జరిగాయని, వాటిపై ఆయన ఎప్పుడూ స్పందించలేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రశ్నించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ అప్పుడు పెదవి కూడా విప్పని జగన్ ఇప్పుడు రాష్ట్రంలో ఏదో జరిగిపోతోందంటూ ప్రధానికి, కేంద్ర హోమ్‌శాఖ మంత్రికి లేఖలు రాశారని పేర్కొన్నారు. ఈ లేఖలు రాయడానికన్నా ముందు జగన్ ఆత్మపరిశీలన చేసుకుని ఉంటే బాగుండేదని అన్నారు.

జిఓల్లో పారదర్శకత ఏదీ?

- పునరుద్ధరణకు నోచుకోని జిఓఐఆర్ పోర్టల్
- అప్పట్లో విమర్శించిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉత్తర్వులు (జిఓలు) నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేసిన అధికారిక పోర్టల్ గవర్నర్‌మెంట్ ఆర్డర్ ఇష్యూఇంగ్ రిజిస్టర్ (జిఓఐఆర్) పోర్టల్‌లో ఇంకా అందుబాటులోకి రాలేదు. దీంతో జిఓల విడుదలలో గోప్యత ఇంకా కొనసాగుతోంది. కీలకమైన ఉత్తర్వులు కూడా ప్రజానీకానికి అందుబాటులోకి రావడం లేదు. వైసిపి ప్రభుత్వ హయంలో జిఓఐఆర్ ద్వారా జిఓల విడుదలను నిలిపివేసిన సంగతి తెలిసిందే. 2021 ఆగస్టు 16వ తేదీన ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అప్పటి సిఎం సెక్రటరీ (సాధారణ పరిపాలనశాఖ) రేవు ముత్యాలరాజు జారీ చేసిన ఆదేశాల్లో సెక్రటరియేట్ మాన్యువల్ ప్రకారం జిఓలు విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఆ మాన్యువల్‌ను రూపొందించే సమయానికి జిఓఐఆర్ వెబ్‌సైట్ లేదు. దీనిని అవకాశంగా తీసుకుని వెబ్‌సైట్‌లో జిఓలను పోస్టు చేయడం ప్రభుత్వం నిలిపివేసింది. అంతకుముందు జిఓలు విడుదల చేయాలంటే జిఓఐఆర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తే ఆటోమేటిక్‌గా నెంబర్‌కూడా వచ్చేది.

ఏరోజు ఇచ్చిన జిఓలు ఆరోజు సమాచారం ప్రజలకు తెలిసేది. వైసిపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో జిఓలు ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి. అప్పట్లో తెలుగుదేశం పార్టీ ఈ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పు పట్టింది. ఆ ఉత్తర్వులను నిలిపివేయాలని కోరుతూ అప్పటి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను కలిసి టిడిపి నేతలు వినతిపత్రం సమర్పించారు. పలువురు వ్యక్తిగతంగా హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలు చేశారు. ఒకేసారి పెద్దఎత్తున ఈ వ్యాజ్యాలు రావడంతో వాటన్నిటినీ ఒకేచోట చేర్చి విచారణ చేయాలని హైకోర్టు నిర్ణయించింది. దీనిపై విచారించిన హైకోర్టు 2023 నవంబరు 16వ తేదీన తీర్పు వచ్చింది. ప్రభుత్వం అనుసరించిన తీరు ప్రజావ్యతిరేకమని, 2022 ఏప్రిల్ ఒకటోతేదీ నుండి ప్రభుత్వం విడుదల చేసిన జిఓలన్నీ ఎపి గెజిట్ వెబ్‌సైట్లో చేర్చాలని, లేనిపక్షంలో సంబంధిత అధికారులను బాధ్యులను చేస్తామని హెచ్చరించింది. ఈమేరకు సాధారణ పరిపాలన శాఖ అన్ని విభాగాలకు ఆదేశాలు జారీచేసింది. కానీ అమలుకు నోచుకోలేదు. దీంతో ఇప్పటికీ జిఓల విడుదలలో పారదర్శకత లోపం కొనసాగుతోంది. టిడిపి ప్రభుత్వం వచ్చి నెలరోజులు దాటినా ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జిపిఎస్ జిఓను గెజిట్‌గా విడుదల చేసిన విషయం తెలిసిందే.

ఆదివాసీల సమస్యలను పరిష్కరించండి

- జాతీయ ఎస్‌టి కమిషన్‌కు ఆదివాసీ గిరిజన సంఘం విజ్ఞప్తి

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)



హుస్సేన్ నాయక్‌కు సమస్యలను వివరిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ఆదివాసీల సమస్యలను పరిష్కరించా లని జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ధర్మన్న పడాల్, పి.బాలదేవ్ కోరారు. ఆదివాసీలకు వంద శాతం ఉద్యోగ రిజర్వేషన్ చట్టబద్ధతపై జోక్యం చేసుకోవాలన్నారు. అల్లూరి జిల్లా పర్యటనకు వచ్చిన హుస్సేన్ నాయక్‌ను శుక్రవారం కలిసి పలు అంశాలపై వారు వినతిపత్రం సమర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐదో షెడ్యూల్డ్ ఏరియాలో ఆదివాసీలకు సంక్రమించిన హక్కులు, చట్టాలను పటిష్టంగా అమలు చేయడం లేదన్నారు. జాతీయ ఎస్‌టి కమిషన్ జోక్యం లేకపోవడం వల్ల ఆదివాసీలను ఆక్రమణదారులుగా ముద్రవేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ గ్రామ సభ, ఎల్‌టిఆర్ చట్టాలు, గిరిజన సలహా మండలి ఆమోదం లేకుండానే ఏజెన్సీ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌ను అదానీకి ఇస్తూ అనుమతులు జారీ చేశారని తెలిపారు. వాటిని తక్షణమే రద్దు చేయాలని కోరారు. పోలవరం నిర్వాసితు లకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, పునరావాసం అమలు చేయకపోవడం వల్ల నిర్వాసితులకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. జిఒ 3ని పునరుద్ధరించాలని కోరారు. కాఫీ రైతులకు బకాయి సొమ్ము, గిట్టుబాటు ధరలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.కృష్ణారావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

హుస్సేన్‌కు ఘన స్వాగతం

హుస్సేన్ నాయక్ తొలుత మోదకొండమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్, సబ్ కలెక్టర్ దాత్రి రెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పిఎంఆర్‌సి వద్ద హుస్సేన్ వివిధ ప్రజా సంఘాల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు.

అరకు ఎంపి తనూజారాణి, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు గిరిజన సమస్యలపై ఆయనకు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం వివిధ గిరిజన సంఘాలతో జరిగిన సమావేశంలో హుస్సేన్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలకు ఎటువంటి అన్యాయం జరిగినా కమిషన్ దృష్టికి తీసుకురావాలన్నారు. ఫిర్యాదులపై కమిషన్ తీసుకున్న చర్యల గురించి పదిహేను రోజుల్లో సమాధానం ఇస్తామని తెలిపారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న అండ్ర మాల్యాద్రి

రాజ్యాంగం, రిజర్వేషన్లు కాపాడుకుందాం

- జాతీయ ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టం సాధించుకుందాం
- కెవిపిఎస్ పిలుపు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

దేశవ్యాప్తంగా రాజ్యాంగాన్ని, రిజర్వేషన్‌లను, ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టాన్ని కాపాడుకునేందుకు, అలాగే ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ అమలు కోసం ఐక్య ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. ఈ మేరకు దేశంలో దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యాన రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్‌లకు వినతిపత్రాలను, అలాగే పార్లమెంటు సభ్యులకు, రాజ్యసభ సభ్యులకు, ప్రతిపక్ష పార్టీల నాయకులకు వినతిపత్రాలు ఇవ్వాలని తీర్మానించింది. విజయవాడలో కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో పలు దళిత, గిరిజన, ప్రజా సంఘాలు పాల్గొని కెవిపిఎస్ ప్రవేశపెట్టిన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించాయి. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎస్‌సి, ఎస్‌టిలు, మైనార్టీలు, మహిళలపై దాడులు పెరిగిపోయాయని తెలిపారు. అత్యాచార నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేయకుండా ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయని విమర్శించారు. అట్రాసిటీ చట్టం అమలు ఎఫ్‌ఐఆర్ నుండి ఇబ్బందుల్లోకి నెడుతున్నారని అన్నారు. సంఘటన స్థలాన్ని సందర్శించి దర్యాప్తును 60 రోజుల్లో పూర్తి చేయాలనే నిబంధనకు నీళ్లు వదులుతున్నారని విమర్శించారు. విచారణకు రాకుండానే సంతకాలు పెట్టి బెయిల్‌కు వున్న నిబంధనలను కాలరాస్తున్నారని అన్నారు. స్టేషన్ బెయిల్ ఇవ్వడం సరైందికాదన్నారు. రాష్ట్రంలో శాంతి కమిటీలను పునరుద్ధరించి, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయాలన్నారు. దురాగతాలన్నింటినీ అరికట్టడానికి, చట్టబద్ధంగా అందరినీ శిక్షించడానికి ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా వెనకబడి ఉన్న దళితులకు రాజ్యాంగంలో వున్న రక్షణలను తొలగించేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు దళితులు, గిరిజనులు ఐక్యం కావాలన్నారు. అలాగే ప్రైవేటు రంగంలో రిజర్వేషన్‌లకై ఉద్యమించాలన్నారు. దళితులకు 80వ దశకంలో తెచ్చిన ఎస్‌సి కాంపోనెంట్‌ను పరిరక్షించుకోవాలన్నారు. జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో సమగ్రమైన ఎస్‌సి సబ్‌ప్లాన్ చట్టం కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి నటరాజ్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, విసికె రాష్ట్ర నాయకులు అచ్చయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు, డివైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు డి రాము, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు పి కిరణ్, దళిత నాయకులు జి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్ష కవితా భేరి అడిగోపుల

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

అడిగోపుల వెంకటరత్నం నాలుగు దశాబ్దాలుగా కవిత్వం రాస్తూ, వివిధ సామాజిక సమస్యలపై తనదైన శైలిలో బలమైన గొంతు వినిపించిన అభ్యుదయ కవి. 1984 నుంచి 2023 వరకూ ఒక కథా సంపుటి, 26 కవితా సంపుటాలూ వెలువరించారు. "ఆయన కవిత్వంలో మనకు జ్ఞాపకం చెయ్యని బాధ అంటూ లేదు. దేశం నిండా దు:ఖం ఉంది. ఇంకేం కావాలి కవిత్వానికి? వెంకటరత్నం గారి లాంటి వ్యక్తిత్వం అగ్నిపర్వతంలా బద్దలవుతుంటే ఆ లావా ప్రవాహాలే వారి కావ్యాల్లో ప్రవహించే కవితలు. చదివితే చాలు నరనరానికీ వర్తమాన స్పృహ వ్యాపిస్తుంది." అని ఆయన గురించి ప్రసిద్ధ కవి గుంటూరు శేషేంద్రశర్మ పేర్కొన్నారు.

అడిగోపుల వెంకటరత్నం సివిల్ ఇంజినీరుగా తన వృత్తిలో తాను ఉంటూనే కవితాప్రవృత్తిని ప్రాణప్రదంగా కొనసాగించారు. సాధారణంగా సాంకేతిక విద్యనభ్యసించినవారు సాహిత్య రంగంలో అరుదుగా కన్పిస్తారు. 1945 జులై 1వ తేదీన నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం కొత్త వంగల్లు గ్రామంలో జన్మించిన అడిగోపుల వెంకటరత్నం ఇంజనీరింగ్ చదివి, నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విభాగంలో పనిచేశారు. 1980 దశకంలో విరివిగా కవిత్వం రాయడం మొదలు పెట్టి, 1984లో "సూర్యోదయం" పేరిట తొలి కవితా సంపుటి వెలువరించారు. తరువాత ఎక్కడా ఆగిపోకుండా, ఎంతో వైవిధ్యభరితంగా కవితా సేద్యం సాగించారు. తెలుగు కవిత్వరంగంలో తనకంటూ ఓ ప్రత్యేక శైలినీ, గుర్తింపును సాధించుకున్నారు. 2023 డిసెంబర్లో వెలువరించిన "నిలువెత్తు సంతకం" ఆయన చివరి, 26వ కవితా సంపుటి. ప్రతి రెండు మూడేళ్లకు ఒక కవితా సంపుటి వెలువరించారంటే ఆయన కవిత్వాన్ని ఎంత ప్రాణప్రదంగా భావించారో అర్థం చేసుకోవొచ్చు. ప్రజాశక్తి, ప్రస్థానం పత్రికల కోసం ఇటీవల కూడా ఆయన కవితలు పంపారు.

అడిగోపుల కవిత్వంలో అభ్యుదయ భావనలు తప్ప సొంత గొడవలూ, ఆత్మానుభూతులు, భావగీతాలు, భక్తితత్వాలు ఉండవు. ఆయన కవిత్వమంతా మనిషిని కేంద్రబిందువుగా తీసుకొని నడుస్తుంది. ఉత్పత్తి సాధనాలన్నీ ఐశ్వర్యవంతుల చేతుల్లో ఉంటే, సామాన్యులూ, శ్రామికులూ దరిద్రులుగానూ వుంటారని భావించే కవి. అడిగోపుల సమాజంలో ఉన్న దానవత్వాన్ని తీవ్రంగా నిరసించారు. సమాజంలోని ప్రజలు హాయిగా, సమస్యలు లేకుండా బతకాలని ఆశించారు.

"ఆరుగాలం కష్టించినా / కడుపులు నిండక కాలిపోతూ వుండడం
ఏ ప్రపంచయుద్ధంతో పోల్చగలం
యుద్ధమంటే మాకు భయంలేదు" అంటారొక కవితలో.

"రేపు అందరి కోసం/ నేడు అందరి ప్రతిఘటన
స్వప్నావిష్కరణ జాగుచేయకు/ మహాపథం నిర్దేశించు"
అని మరొక కవితలో పథనిర్దేశం చేశారు. జీవితాంతం శ్రామిక ప్రజాపక్షపాత కవిగానే ఉన్నారు.

"ఆంక్షలెప్పుడూ సడలించుకోవు / అతిక్రమించడమే
సంకెళ్ళు ఎప్పుడూ విచ్చుకోవు / తెంచుకోవడమే" అని విస్పష్టంగా పేర్కొన్నారు.

సమాజ మార్పు కోసం నిరంతరం తపించే కవిగా, సమకాలీన పరిస్థితుల మీద రూపొందించిన శ్వేతపత్రమే అడిగోపుల కవిత్వం.

"యుద్ధమంటే
రెండు దేశాలు మాసిపోవటం
ప్రపంచపటం మారిపోవటం
యుద్ధం తలకెక్కినవాడు / శాంతిని తిలకించడు
శాంతిని రుచి చూసినవాడు / యుద్ధాన్ని తలచడు"



అంటూ పేర్కొన్న అభ్యుదయ కవి అడిగోపుల వెంకటరత్నం వర్తమాన తరానికి ఆదర్శప్రాయుడైన కవి.

పలువురి సంతాపం

అడిగోపుల వెంకటరత్నం (78) మృతి పట్ల సాహితీ స్రవంతి రాష్ట్ర కమిటీ దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. జీవితాంతం ఆయన అభ్యుదయ కవిగా కవితాసేద్యం చేశారని నివాళులర్పించింది. అధ్యక్ష కార్యదర్శులు కె.సత్యరంజన్, కెంగార మోహన్, గౌరవ అధ్యక్షులు తెలకపల్లి రవి, సాహితీ ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ సంతాపం తెలిపారు. ఎపి రచయితల సంఘం గౌరవ సలహాదారు అడిగోపుల వెంకటరత్నం మృతికి ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ సి.భవానీదేవి, చలపాక ప్రకాష్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. సాహితీరంగంలో అడిగోపుల లేనిలోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ముజఫర్ అహ్మద్

శిక్షలు పెంచితే ప్రమాదాలు తగ్గుతాయా?

- బిఎన్ఎస్ 106 (1, 2)ను రద్దు చేయాలి
- ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

రోడ్డు రవాణా డ్రైవర్లకు ఉరితాడు వంటి బిఎన్ఎస్ సెక్షన్ 106 (1, 2)ను, మోటారు ట్రాన్స్‌పోర్టు సవరణ చట్టం 2019ను, జిఒ 21ని రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ డిమాండ్ చేశారు. భారీగా పెంచిన జరిమానాలు అమలులోకి వచ్చి నాలుగు సంవత్సరాలైనా ప్రమాదాలు తగ్గలేదని, అసలు కారణాలను పరిష్కరించకుండా శిక్షలు పెంచితే ప్రమాదాలు తగ్గుతాయని చెప్పడం మోసగించడమే అవుతుందని తెలిపారు. డ్రైవర్లుకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెట్రోల్, డీజిల్‌లో పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరారు. శుక్రవారం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర రవాణా కార్మికుల సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మోటారు ట్రాన్స్‌పోర్టు చట్టం సెక్షన్ 106 (1, 2) పేరుతో అనేక దాడులు జరుగుతున్నాయన్నారు. డ్రైవర్ల పట్ల కేంద్ర ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యం కారణమైతే గతంలో గరిష్టంగా రెండు సంవత్సరాలు శిక్ష ఉండేదని, ప్రస్తుత సెక్షన్ 106 (1) (2) ప్రకారం పది సంవత్సరాల జైలు, రూ.ఏడు లక్షల జరిమానా విధించేలా నిబంధనలు ఉన్నాయని వివరించారు. ఇప్పటివరకు ప్రమాదాలు జరిగిన వెంటనే స్టేషన్ బెయిల్ తీసుకునే అవకాశం ఉండేదని, కొత్త చట్టంలోని నిబంధనల వల్ల కోర్టులో బెయిల్ కోసం ఎదురు చూడాల్సి వస్తుందని తెలిపారు. రవాణా రంగ కార్మికుల ద్వారా ప్రభుత్వాలకు రూ.ఐదు లక్షల కోట్లు ఆదాయం వస్తున్నా మోటారు కార్మికుల సంక్షేమానికి ఎటువంటి చట్టమూ లేకుండా పోయిందని వాపోయారు. ఆటో డ్రైవర్లు, ఇతర రవాణా రంగ కార్మికులకు రక్షణ కల్పించే విధంగా కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఢిల్లీ రాష్ట్రాల తరహాలో సమగ్ర సంక్షేమ చట్టాన్ని చేయాలని, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రవాణా రంగ కార్మికుల సమస్యలపై బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. సమస్యలన్నింటినీ పరిష్కరించాలని తీర్మానం చేశారు. విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు శివాజీ, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, విశాఖ జిల్లా మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు బి.జగన్, అధ్యక్ష, కార్యదర్శులు శివ, జి.అప్పలరాజు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కోసం గాలిస్తున్నాం : హోంమంత్రి

ప్రజాశక్తి -తిరుమల/ నరసాపురం



అలిపిరి నడకదారిలో మెట్లు ఎక్కుతున్న హోంమంత్రి

నరసాపురం ఎంపిడిఒ వెంకటరమణ కోసం ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు గాలిస్తున్నాయని, ఆయన సురక్షితంగా తిరిగి వస్తారని భావిస్తున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు అలిపిరి మెట్ల మార్గం ద్వారా కుటుంబసభ్యులు, పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి శ్రేణులతో కలిసి పాదయాత్రగా ఆమె తిరుమలకు చేరుకున్నారు. తిరుమల నడక మార్గాల్లో యాత్రికులు సురక్షితంగా తిరుమలకు చేరుకునేలా భద్రత పెంచుతామని, వన్య మృగాల దాడులు నివారణకు పటిష్ట చర్యలు చేపడతామని, యాత్రికుల ఆత్మ సంరక్షణకు గత ప్రభుత్వం దొడ్డు కర్రలు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించనున్నారు.


ఎంపిడిఒ అదృశ్యంపై పోలీసుల విచారణ

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ఎంపిడిఒ రమణరావు అదృశ్యం ఘటనపై పోలీసులు విచారణ ప్రారంభించారు. కృష్ణా జిల్లా ఉయ్యూరు సిఐ ఎమ్‌డి హబీబ్‌భాషా, నరసాపురం టౌన్ సిఐ కెఎ.స్వామి తన సిబ్బందితో కలిసి శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయానికి చేరుకుని ఉద్యోగులను విచారించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం నరసాపురంలోని ఫెర్రీరేవు నిర్వహణకు ఏర్పాటు చేసిన జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులను కూడా విచారించారు.

జాతీయ పండుగగా రొట్టెల పండగ

- రూ .5 కోట్లు విడుదల
- వర్చువల్‌గా యాత్రికులతో మాట్లాడిన సిఎం

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి



రొట్టెల పండుగలో వర్చువల్‌గా మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

నెల్లూరులో జరిగే రొట్టెల పండుగకు జాతీయ స్థాయి పండుగగా గుర్తింపు తీసుకొస్తామని ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి నుంచి వర్చువల్‌గా శుక్రవారం యాత్రికులతో మాట్లాడారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే నెల్లూరు బారాషాహిద్ దర్గా రొట్టెల పండుగకు వందేళ్ల ఘన చరిత్ర ఉందని, ప్రజలకు అపార నమ్మకం, ప్రగాఢ విశ్వాసానికి నిదర్శనంగా ఈ పండగ నిర్వహిస్తున్నారని అన్నారు. ముందుగా 2014 నుంచి 2019 వరకు తమ ప్రభుత్వ హయాంలో దర్గాలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సిఎంకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ వివరించారు. రొట్టెల పండుగకు భారీగా యాత్రికులు విచ్చేస్తారని, ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. దర్గాను, స్వర్ణాల చెరువును అభివృద్ధి చేశామని, ప్రస్తుతం ప్రార్థనా మందిరం నిర్మాణం నిలిచిపోయిందని సిఎం దృష్టికి మంత్రి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ప్రార్థనా మందిరం నిర్మాణానికి రూ. ఐదు కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ పండుగలో పాల్గొనే వారికి సిఎం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి పి. నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంఎల్‌ఎలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కలెక్టర్ ఒ. ఆనంద్, ఎస్‌పి కృష్ణకాంత్ పాల్గొన్నారు.

'ల్యాండ్ గ్రాబింగ్'తో భూ వివాదాలు పరిష్కారం : పల్లా శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్న ల్యాండ్ గ్రాబింగ్ చట్టంతో భూ సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. టిడిపి కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం శుక్రవారమూ కొనసాగింది. ప్రజలు, టిడిపి కార్యకర్తల నుంచి ఫిర్యాదులు, వినతులను పల్లా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ, నిరుద్యోగ సమస్యలు, అక్రమ కేసుల గురించి అధికంగా తమకు వినతులు వచ్చాయని చెప్పారు. నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తుందని తెలిపారు. మాజీ సిఎం వైఎస్ జగన్ మరోసారి శవ రాజకీయాలకు తెరలేపారని విలేకరుల సమావేశంలో పల్లా విమర్శించారు. వ్యక్తుల మధ్య జరిగిన హత్యను టిడిపికి రుద్దుతున్నారని అన్నారు. గవర్నర్ ప్రసంగం ఆపుతామని, ఢిల్లీలో ధర్నాలు చేస్తామని అనడం దేనికి సంకేతమని ప్రశ్నించారు.

సిఎం దృష్టికి మాజీ సైనికుల సమస్యలు

మాజీ సైనికుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు టిడి జనార్ధన్ అన్నారు. ఆర్మీ రిటైర్డు ఉద్యోగుల సమావేశం టిడిపి కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, ఎపి స్టేట్ ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోటూరి శంకరరావు, వై రమేష్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్యను పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు కలిశారు.

వేకెన్సీలు చూపకుండా విధుల నుంచి తొలగించొద్దు : ఎన్‌హెచ్‌ఎం జెఎసి విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న స్టాఫ్‌నర్స్, ఇతర ఉద్యోగులకు వేకెన్సీలు చూపించకుండా విధుల నుంచి తొలగించొద్దని ఎపి నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. ఈ మేరకు జెఎసి చైర్మన్ డి దయామణి, కన్వీనర్ సిహెచ్ ప్రభాకరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్‌సిడి, సిమాంక్, ఎన్‌బిఎస్‌యు, హెడ్‌డిఐసియులో పనిచేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు పనిచేసే ఆస్పత్రుల్లో గానీ, ఉమ్మడి జిల్లాల్లో ఉన్న ఖాళీల్లో గానీ భర్తీ చేయాలని కుటుంబ, ఆరోగ్య సంక్షేమ కమిషనర్, మిషన్ డైరెక్టర్ జూన్ 18న ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఈ ఆదేశాలను జిల్లాల అధికారులు అమలు చేయకుండా ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేయడం సరైంది కాదని తెలిపారు. ఆదేశాలకు భిన్నంగా ఉద్యోగులకు వేకెన్సీలు చూపించకుండా ప్రస్తుతం పనిచేస్తున్న వారిని విధుల నుంచి రిలీవ్ చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. దీనివల్ల ఏళ్లతరబడి తక్కువ వేతనంతో పనిచేస్తున్న ఎన్‌హెచ్‌ఎం స్టాఫ్ నర్సులు, ఉద్యోగులు మానసికంగా ఆందోళన చెందుతున్నారని వివరించారు. ఏలూరు జిజిహెచ్, జంగారెడ్డిగూడెం, తాడేపల్లి గూడెం ఏరియా ఆస్పత్రుల్లో పనిచేస్తున్న 35 మంది స్టాఫ్ నర్సులను, ఇతర ఉద్యోగులను జులై 5న విధుల నుంచి రిలీవ్ చేశారని తెలిపారు. ఇప్పటికీ పోస్టింగ్ ఇవ్వలేదని పేర్కొన్నారు. వివిధ జిల్లాల్లో కిందిస్థాయి అధికారులు సరైన సమాచారం ఇవ్వడం లేదని, ఖాళీలు లేకపోతే తొలగిస్తామని ఉద్యోగులను భయాందోళనకు గురిచేస్తున్నారని వివరించారు. ఆరోగ్య శాఖమంత్రి వెంటనే జోక్యం చేసుకొని సమస్యలను వెంటనే పరిష్కరించేలా సంబంధిత అధికారులకు నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రస్థాయి అధికారులు కూడా జోక్యం చేసుకోవాలని కోరారు.

కింది కోర్టు సర్టిఫైడ్ కాపీ జాప్యంపై ఉత్తర్వులిస్తాం : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయాలని కోరుతూ జడ్జిగా చేసిన రామకృష్ణ 2021లో వేసిన ప్రైవేటు ఫిర్యాదులో కింది కోర్టు ఉత్తర్వుల సర్టిఫైడ్ కాపీని పిటిషనర్‌కు ఇవ్వడంలో ఆలస్యంపై రిపోర్టు తెప్పించుకుంటామని హైకోర్టు చెప్పింది. దీనిపై పరిపాలనాపరమైన ఆదేశాలిస్తామని చెప్పింది. ప్రిసైడింగ్ ఆఫీసర్ రిపోర్టుపై స్పందించాలని రామకృష్ణను ఆదేశించింది. విచారణను 8 వారాలకు వాయిదా వేస్తున్నట్లు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎన్ జయసూర్యతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఆదేశించింది. పెద్దిరెడ్డిపై రామకృష్ణ వేసిన ప్రవేటు ఫిర్యాదుపై 2023 ఆగస్టు 18న ఆర్డర్ ఇచ్చింది. దీని సర్టిఫైడ్ కాపీలు ఇవ్వాలని రామకృష్ణ అప్లికేషన్ పెట్టుకుంటే కింది కోర్టు ఇవ్వలేదని హైకోర్టుకు వచ్చారు. రెండు రోజుల్లో సర్టిఫైడ్ కాపీ ఇవ్వాలని ఇటీవల హైకోర్టు, చిత్తూరు జిల్లా ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక కోర్టు న్యాయాధికారిని ఆదేశించింది. ఎందుకు ఆలస్యమైందో వివరణ ఇవ్వాలని ఆ కోర్టు ప్రిసైడింగ్ అధికారికి ఆదేశించింది. శుక్రవారం విచారణలో సర్టిఫైడ్ కాపీ అందిందని పిటిషనరు తరపున న్యాయవాది చెప్పారు. జాప్యంపై తాము పరిపాలనాపరమైన ఉత్తర్వులిస్తామని బెంచ్ పేర్కొంది.



ఇంద్రకీలాద్రిపై శాకంబరీ ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై శ్రీ అమ్మవారి శాకంబరీ దేవి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. శాకంబరీ దేవి ఉత్సవాలు మొదటి రోజు సందర్భంగా ఆకుకూరలు, కూరగాయలతో దేవస్థానం ప్రాంగణాన్ని, అమ్మవారిని, ఉపాలయములలోని దేవతామూర్తులను, ఉత్సవ మూర్తులను అలంకరించారు. ఈ నెల 21వ తేదీ వరకూ మూడురోజుల పాటు దేవస్థానంలో అంగరంగ వైభవముగా ఈ ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి కెఎస్ రామారావు తెలిపారు. అలంకరణ నిమిత్తం పెద్ద మొత్తంలో ఆకుకూరలు, కాయగూరలను దాతలు, సందర్శకులు విరాళంగా అందజేశారని చెప్పారు. సకాలములో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండి ప్రజలు, రైతులు సుఖ- సంతోషాలతో జీవించేందుకు శాకాంబరీ దేవి ఉత్సవాలు నిర్వహించడం ఆచారంగా వస్తోందని వివరించారు. ఉత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో యాత్రికులు దర్శించుకున్నారని తెలిపారు. యాత్రికులకు కదంబం ప్రసాదాన్ని ఇఒ రామారావు పంపిణీ చేశారు.

స్వామినాథన్ సిఫారసులు అమలు చేయండి

- వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల విధానం రద్దు చేయాలి
- ఎంపి కేశినేని శివనాథ్‌కు ఏపి రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి విజ్ఞప్తి



ఎంపి కేశినేని శివనాథ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపి రైతు సంఘాల సమన్వయ సమితి నేతలు

ప్రజాశక్తి - విజయవాడ

రైతులు పండించిన అన్ని పంటలకు స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలని, వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్ల విధానం రద్దు చేయాలని కోరుతూ విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్, మాజీ వ్యవసాయ శాఖ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు నేతృత్వంలో పలు రైతు సంఘాల రాష్ట్ర నేతలు శుక్రవారం ఎంపి శివనాథ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వడ్డే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలను నిలుపుదల చేయాలని, రైతులు పండించిన పంటలకు వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులపై 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధరలు నిర్ణయించాలని, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల విధానం రద్దు చేయాలని కోరారు. విద్యుత్ ప్రయివేటీకరణ చట్టం 2022 రద్దు చేయాలని, వ్యవసాయ సంబంధిత ఉపకరణాలైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, విద్యుత్, పెట్రోల్ ఉత్పత్తులు, ట్రాక్టర్ల సంబంధిత వాహనాలపై జిఎస్‌టి రద్దు చేయాలని, రైతు అనుకూలమైన భూసేకరణ చట్టం 2013 అమలు చేసేటప్పుడు ప్రతి సంవత్సరం పెరిగే భూమి ధరలను పరిగణనలోకి తీసుకుని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులకు ఒకేసారి రుణ విముక్తి కలిగించాలని, 2020-21లో ఢిల్లీలో రైతు ఉద్యమం సందర్భంగా చనిపోయిన 736 మంది రైతుల జ్ఞాపకార్థం స్మారక స్థూపం ఏర్పాటు చేయాలని, ఆ పోరాటంలో రైతులపై పెట్టిన కేసులను కేంద్రం ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎంపి కేశినేని స్పందిస్తూ... సమన్వయ సమితి ఇచ్చిన డిమాండ్లను పార్లమెంటు దృష్టికి, కేంద్ర వ్యవసాయ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్ర, కార్యనిర్వాహక కార్యదర్శి గుండపనేని ఉమావర ప్రసాద్, ఏపి రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు, సింహాద్రి ఝాన్సీ, ఎం.యలమందారావు, మరీదు ప్రసాదబాబు, పి.వి.ఆంజనేయులు, కాసాని గణేష్ బాబు, చల్లపల్లి విజయ, కోగంటి కోటయ్య పాల్గొన్నారు.

పరిష్కారానికి నోచని సమస్యలు

- గంధం చంద్రుడుకు క్లాప్ డ్రైవర్ల వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో విధులు నిర్వహిస్తున్న క్లాప్ డ్రైవర్లు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని, తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి కె నాగభూషణ్, కె ఉమామహేశ్వరరావు, ఎస్ జ్యోతిర్మయి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి గంధం చంద్రుడును కలిసి వినతిపత్రం అందజేశారు. క్లాప్ డ్రైవర్లు కనీస వేతనాలకు నోచుకోకపోవడమే కాకుండా కాంట్రాక్టర్లు చెల్లిస్తున్న అరకొర వేతనాలు కూడా ప్రతినెలా చెల్లించడం లేదని పేర్కొన్నారు. బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని ప్రతినెలా ఐదో తేదీలోపు వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. గత 17 రోజుల సమ్మెకాలం వేతనం చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇపిఎఫ్, ఇఎస్ఐ వాటా నిధులను సకాలంలో చెల్లించాలని, ఖాతాల వివరాలు క్లాప్ డ్రైవర్లకు అందించాలని అన్నారు. చట్టబద్ధమైన వారాంతపు సెలవులు, క్యాజువల్ లీవ్స్ జాతీయ పండగ సెలవులు అమలు చేయాలని, మున్సిపల్ కార్మికులకు అమలవుతున్న విధంగా క్లాప్ డ్రైవర్లకూ యూనిఫామ్, చెప్పులు, సబ్బులు, నూనెలు, టవల్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్‌డిఎ అవినీతికి పరాకాష్ట ఐఎఎస్‌ల వేలం

- రాష్ట్ర అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో ఎన్‌డిఎ ప్రభుత్వంలో అవినీతి రాజ్యమేలుతోందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ విమర్శించారు. బిజెపి పాలిత రాష్ట్రమైన మహారాష్ట్రలో ఐఎఎస్ అధికారుల పోస్టింగుల కోసం మంత్రులు రూ.ఐదు కోట్లతో వేలం నిర్వహించడం సిగ్గుచేటని, ఇది ఎన్‌డిఎ అవినీతికి పరాకాష్ట అని అన్నారు. శుక్రవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. మోడీ ప్రభుత్వం వచ్చాక సామాన్యులు జీవించలేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. నిరుద్యోగం, ధరల స్థిరీకరణ అంశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నుంచి ఉపాధి వెతుక్కుంటూ రోజూ వేలాదిమంది వలస పోతున్నారని అన్నారు. కుప్పం నుంచి కర్ణాటకకు వెళ్లే రైళ్లన్నీ వలస కార్మికులతో నిండుతున్నాయన్నారు. ఇప్పటివరకు పోలవరం నిర్వాసితులకు ఎంత ఖర్చు చేశారో చెప్పాలన్నారు. రాష్ట్రంలో 2004 నుంచి 2024 మధ్య కాలంలో పోలవరం ప్రాజెక్టుకు ఎన్ని వేల కోట్లు ఖర్చు చేశారు? నిర్మాణ పనులు ఎవరికి అప్పగించారనే అంశంపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. 2019లో రూ.2.65 లక్షల కోట్ల అప్పులు వున్న రాష్ట్రంలో ఇప్పుడు రూ.14 లక్షల కోట్లకు పెరిగిందని అంటున్నారని, ఈ పెరిగిన అప్పులతో ఏపి అభివృద్ధి పనులు చేపట్టారో శ్వేతపత్రం విడుదల చేయాలని అన్నారు.

'మద్యం అక్రమాల'పై ముమ్మరంగా విచారణ

- పై అధికారుల అనుమతి లేకుండానే నిర్ణయాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం అక్రమాలపై సిఐడి విచారణను ముమ్మరం చేసింది. అప్పట్లో ఎపి బేవరేజెస్ కార్పొరేషన్ ఎమ్‌డిగా, డిస్టిలరీల కమిషనర్‌గా పనిచేసిన వాసుదేవ రెడ్డిపై తవ్వేకొద్దీ అక్రమాలు వెలుగులోకి వస్తున్నట్లు సమాచారం. ఎపి బేవరేజెస్ కార్పొరేషన్, డిస్టిలరీల విధాన నిర్ణయాలను ఉన్నతాధికారుల అనుమతితోనే అమలు చేయాల్సి వుండగా వాసుదేవరెడ్డి దానికి భిన్నంగా వ్యవహరించినట్లు చెబుతున్నారు. ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కమిషనర్‌లకు ఫైళ్లు పంపకుండా అనేక నిర్ణయాలను ఆయన తీసుకున్నట్లు సిఐడి విచారణలో తేలినట్లు సమాచారం. దీనిని ప్రశ్నించిన కొందరు ఉన్నతాధికారులను కూడా ఆయన బెదిరించినట్లు చెబుతున్నారు. ఒకే రకమైన బ్రాండ్ మద్యాన్ని తెలంగాణ కంటే అధిక ధరకు కొనుగోలు చేసినట్టు సిఐడి విచారణలో గుర్తించింది. బినామీ పేర్లతో కొన్ని డిస్టిలరీ వ్యాపారాల్లోకి ఆయన నేరుగా చొరబడినట్లు కూడా చెబుతున్నారు. 2014-2019 మధ్యలో తక్కువ రేటు ఉన్న మద్యం బ్రాండ్‌లు 32 అందుబాటులో ఉంటే వాటిలో కేవలం రెండింటిని మాత్రమే కొనసాగించారు. వాటిని కూడా అధిక ధరలకు విక్రయించినట్లు విచారణలో గుర్తించారు. కొన్ని ప్రీమియం బ్రాండ్‌ల పేర్లతో కొత్త బ్రాండ్‌లు తెచ్చి అమ్మకాలను కొనసాగించినట్లు గుర్తించారు. రాష్ట్రంలో 2019 నాటికి వున్న ప్రముఖ డిస్టిలరీలను సబ్ లీజుల పేరుతో వైసిపి నాయకులకు కట్టబెట్టేలా వాసుదేవరెడ్డి చర్యలు తీసుకున్నట్లు ఆరోపణలు వున్నాయి. అలా హస్తగతం చేసుకున్న డిస్టిలరీల నుంచే 65 శాతం మేర వాసుదేవరెడ్డి మద్యం కొనుగోళ్లు చేశారని సిఐడి గుర్తించింది. అప్పుల చెల్లింపుల కోసం మద్యం ఆదాయాన్ని, ఎపి స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రూ14,276 కోట్లు మళ్లించినటు సిఐడి గుర్తించింది.

మా పాప మాకు కావాలి

- మంత్రులు ఫరూక్, బిసి జనార్థన్‌ను నిలదీసిన బాలిక తల్లిదండ్రులు
- రూ.10 లక్షల పరిహారం అందజేత

ప్రజాశక్తి-పగిడ్యాల (నంద్యాల)


'మా పాప మాకు కావాలి..' అని మంత్రులు ఫరూక్, బిసి జనార్ధన్‌ను నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ఎల్లాల గ్రామంలో అత్యాచారం, హత్యకు గురైన బాలిక తల్లిదండ్రులు నిలదీశారు. 'మా బాలిక ఉందో లేదో తెలియడం లేదు. కనీసం మృతదేహమైనా అప్పజెప్పండి. దహన సంస్కారాలు చేసుకుంటాం' అని వారి ఎదుట కన్నీరు మున్నీరుగా విలపించారు. బాలిక కుటుంబ సభ్యులను శుక్రవారం మంత్రులు ఫరూక్, బిసి జనార్ధన్ రెడ్డి పరామర్శించారు. రూ. పదిలక్షల పరిహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బాలిక ఆచూకీ లభించకపో వడం వెనుక నిందితుల కుటుంబ సభ్యుల ప్రమేయం ఉందన్నారు. బాధిత కుటుంబానికి నిత్యం అందుబాటులో ఉంటామని, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి ఇల్లు కట్టించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారిని మంత్రులు ఆదేశించారు. నంద్యాల ఎంపి శబరి మాట్లాడు తూ..పాప ఆచూకీ దొరికేంత వరకూ ముచ్చు మర్రి వదిలిపెట్టనని, నిందితులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా ఎస్‌పి అధిరాజ్ సింగ్ రాణా, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయ సూర్య, డిఎస్‌పి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాసంతి కేసును సిబిఐకి అప్పచెప్పాలి : సిపిఎం

గత 13 రోజుల నుంచి బాలిక ఆచూకీ లభ్యం కాలేదని, బాలిక ఆచూకీ కనిపెట్టడంలో పోలీసులు విఫలం చెందారని, ఈ కేసును సిబిఐకి అప్పజెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు ఫక్కిర్ సాహెబ్, కె. భాస్కర్ రెడ్డి, బెస్తరాజు, గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రులు ఫరూక్‌కు, బిసి జనార్ధన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తుండగా... 'మీరు చెప్తే వినాలా..మాకు అన్నీ తెలుసులే.. మీరు చెప్పాల్సిన అవసరం లేదు..' అని మంత్రి ఫరూక్ అనడంతో నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. మంత్రి జనార్ధన్ కలగజేసుకొని ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు, ఐదెకరాల భూమి, కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ సిపిఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొమ్ము వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, మద్దమ్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ రంగంలోకి నో ఎంట్రీ

- కార్పొరేట్ల ప్రవేశంపై ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్



ముంబయి : కార్పొరేట్లు, వ్యాపారస్తులను బ్యాంకింగ్ రంగంలోకి అనుమతించే యోచన లేదని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. శుక్రవారం ముంబయిలో ఫైనాన్సియల్ ఎక్స్‌ప్రెస్ నిర్వహించిన ఓ సమావేశంలో శక్తికాంత మాట్లాడుతూ.. ప్రస్తుతం బ్యాంకులను ప్రోత్సహించేందుకు వ్యాపార సంస్థలను అనుమతించే ప్రణాళిక రిజర్వ్ బ్యాంక్ వద్ద లేదన్నారు. ఈ రంగంలోకి కార్పొరేట్ సంస్థలను అనుమతించడం వల్ల వడ్డీ రిస్కులు, సంబంధిత పార్టీ లావాదేవీల్లో లోపాలు నెలకొనే అవకాశం ఉందన్నారు. పదేళ్ల క్రితం పలు సంస్థలు బ్యాంకింగ్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తులు చేసు కోగా.. ఆర్‌బిఐ అనుమ తులను నిరాకరిం చింది. ప్రస్తుత సమయం లో కార్పొ రేట్లకు బ్యాంకింగ్ లైసెన్స్‌లు ఇచ్చే ఆలోచన లేదని ఓ ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. "బ్యాంకులు ఇతర వ్యాపారాల కంటే భిన్నమైనవి. ఇప్పటి వరకు ఉన్న ప్రపంచ అనుభవాల ప్రకారం.. వ్యాపార సంస్థలను అనుమతించినట్లయితే వాటి ఆసక్తులు, సంబంధిత పార్టీ లావాదేవీలకు సంబంధించిన సమస్యల సంభావ్య వైరుధ్యాలను ఎదుర్కోవాల్సి వస్తుంది." అని దాస్ అన్నారు.

భారత్‌లో బ్యాంక్‌ల జాతీయికరణకు ముందు.. 1960 చివరి దశకంలో బ్యాంకింగ్ రంగంలోని వ్యాపార సంస్థల అనేక అనుభవాలు ఉన్నాయన్నారు. సంబంధిత సంస్థ లావాదేవీలను పర్యవేక్షించ డం లేదా నియంత్రించడం, నిరోధించడం చాలా కష్టమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అనుభవం కూడా ఇదేనన్నారు. ఇందులో ఎక్కువగా నష్టాలు ఉంటాయన్నారు. ఆర్థిక వ్యవస్థ వద్ధి చెందడానికి వనరులు అవసరం.. అయితే ఆ ఆకాంక్షలను సాధించడానికి మరిన్ని బ్యాంకులు అవసరం లేదన్నారు. భారత్‌కు కావలసింది బ్యాంకుల సంఖ్యలో విస్తరణ కాదన్నారు. దేశానికి మంచి బ్యాంకులు, ఆరోగ్యకరమైన బ్యాంకులు, సుపరిపాలన ఉన్న బ్యాంకులు అవసరమన్నారు. విత్త సంస్థలు ప్రస్తుత సాంకేతికత ద్వారా దేశ వ్యాప్తంగా పొదుపులను సమీకరించగలవని, రుణాల అవసరాలను తీర్చగలవని భావిస్తున్నామన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఎంఎస్ఎంఇ శిక్షణ కేంద్రాలు : మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి - అచ్యుతాపురం, ఉక్కునగరం విలేకరులు

రాష్ట్ర వ్యాప్తంగా ఎంఎస్ఎంఇ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు పరిశీలన జరుపుతున్నామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఉన్న ఎంఎస్ఎంఇ శిక్షణా కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు ఈ సందర్భంగా కార్మికులతోనూ, ఉద్యోగులతోనూ, అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులతోనూ సమావేశమయ్యారు. ఎంఎస్ఎంఇ శిక్షణా కేంద్రం పనితీరును సమీక్షించారు. విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దేశవ్యాప్తంగా 15 ఎంఎస్ఎంఇ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిలో ఒకటి అచ్యుతాపురంలో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ శిక్షణా కేంద్రం పనితీరు అద్భుతంగా ఉందని కొనియాడారు. ప్రస్తుతం మూడు వేల మంది శిక్షణ పొందుతున్నారని, ఆ సంఖ్యను ఐదు వేలకు పెంచాలని చూస్తున్నామని తెలిపారు. శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు చూపుతామన్నారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా ఉక్కు నగరం పరిధిలో ఉన్న ఎపి మెడ్ టెక్ జోన్‌నూ మంత్రి శ్రీనివాస్ సందర్శించారు. అక్కడ వివిధ కంపెనీల ఆపరేషన్స్ ప్రక్రియలను పరిశీలించారు. వైద్య పరికరాల తయారీకి సంబంధించిన వివిధ కంపెనీలను సందర్శించిన ఆయన వివిధ కంపెనీల సిఇఒలతో భేటీ అయ్యారు. ఆయన వెంట విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిశ్రమల శాఖల అధికారులు గణపతి, శ్రీధర్ ఉన్నారు.

మార్కెట్లకు బడ్జెట్ భయాలు

- సెన్సెక్స్ 739 పాయింట్ల పతనం
- రూ.8 లక్షల కోట్ల సంపద ఆవిరి



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో బడ్జెట్ భయాలు నెలకొన్నాయి. వచ్చే వారం బడ్జెట్ నేపథ్యంలో పరిస్థితులు ప్రతికూలంగా ఉండొచ్చనే అంచనాల్లో ఇన్వెస్టర్లు ముందు జాగ్రత్తగా వారాంతం సెషన్‌లో భారీగా అమ్మకాలకు దిగారు. దీంతో ఒక్క పూటలోనే రూ.8 లక్షల కోట్ల సంపద ఆవిరయ్యింది. కేంద్రం ప్రభుత్వం ఈ నెల 23న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. శుక్రవారం నాడు సూచీలు ఉదయం లాభాల్లో ప్రారంభమైనప్పటికీ.. కాసేపట్లోనే క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. అన్ని ప్రధాన సూచీల్లో అమ్మకాల ఒత్తిడి చోటు చేసుకోవడంతో బిఎస్ఇ సెన్సెక్స్ 738.81 పాయింట్లు పతనమై 80,604.65కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 270 పాయింట్లు కోల్పోయి 24,530 వద్ద ముగిసింది. సెన్సెక్స్-30లో 26 సూచీలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. ఇన్ఫోసిస్, ఐటిసి, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సిఎల్ టెక్ స్టాక్స్ మాత్రమే లాభపడ్డాయి. బిఎస్ఇ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.454.4 లక్షల కోట్ల నుంచి రూ.446.4 లక్షల కోట్లకు తగ్గింది. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 2.2 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీలో అన్ని రంగాలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. లోహ సూచీ అధికంగా 4 శాతం నష్టపోగా.. రియాల్టీ 2.66 శాతం, ఆటో 2.4 శాతం చొప్పున విలువ కోల్పోయాయి.

రిలయన్స్‌కు రూ.15,138 కోట్ల లాభాలు



ముంబయి : ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ 2024 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 15,138 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలోని రూ.16,011 కోట్ల లాభాలతో పోల్చితే 5 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. కాగా.. కంపెనీ రెవెన్యూ 12 శాతం పెరిగి రూ.2.36 లక్షల కోట్లకు చేరింది. గడిచిన జూన్ త్రైమాసికంలో రిలయన్స్ జియో రెవెన్యూ 13 శాతం పెరిగి రూ.29.449 కోట్లకు చేరింది. కంపెనీ నికర లాభాలు 12 శాతం వృద్ధితో రూ.5,698 కోట్లుగా నమోదయ్యాయి. క్రితం మూడు మాసాల్లో కొత్తగా 80 లక్షల మంది వినియోగదారులు జోడించబడ్డారని ఆ సంస్థ తెలిపింది. ప్రతీ వినియోగదారుడి నుంచి సగటు రాబడి రూ.181.7గా నమోదయ్యింది.

సంపాదకీయం

శాంతి నెలకొల్పాలి

ఒక వైపు మహిళలు, చిన్నారులపై అకృత్యాలు మరో వైపు రాజకీయ కక్షలు, కార్పణ్యాలతో రాష్ట్రంలో శాంతి భద్రతలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎ.పి. ప్రజలకు శాంతి భద్రతల చింత ఇప్పటిది కాదు. గత వైసిపి జమానాలో ప్రారంభమై ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతోంది. కూటమి సర్కారు వచ్చాక నలభై రోజుల్లో ఇరవై మంది మహిళలు, బాలికలపై మానవ మృగాల లైంగిక దాడులు జరిగాయి. వారిలో నలుగురు అత్యాచారానికి గురై పాశవికంగా హత్యకు గురయ్యారు. పసికందులను సైతం వదలట్లేదు కామాంధులు. లోకం దృష్టిలోకొచ్చినవి విజయనగరం, నంద్యాల, చీరాల, అనంతపురం, అనకాపల్లి, చిత్తూరు వంటివి కొన్నే. ఫిర్యాదుల దాకా, కేసుల దాకా రానివి ఇంకెన్ని ఉన్నాయో తెలీదు. మహిళలపై ఘోరాలకు పాల్పడేవారికి షాక్ ట్రీట్‌మెంట్ ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు కన్నెర్ర చేసినా, స్త్రీలపై అఘాయిత్యాలకు ఒడిగట్టే వారికి అదే చివరి రోజు అవుతుందని హోం మంత్రి అనిత హెచ్చరించినా అఘాయిత్యాలు, వేధింపులు ఆగలేదని రాష్ట్రంలో వరసగా జరుగుతున్న ఘటనలు తెలుపుతున్నాయి.

ఒకదాని తర్వాత మరొకటిగా జరుగుతున్న రాజకీయ హత్యలు, ఘర్షణలు, దొమ్మీలు ఒకింత ప్రజలను కలవరపెడుతున్నాయి. వినుకొండలో వైసిపి కార్యకర్త దారుణ హత్య రాజకీయ ముఠా కక్షలకు పరాకాష్ట. హత్యకు గురైన బాధితుడి కుటుంబం ఊరికెళ్లి వైసిపి అధ్యక్షుడు, మాజీ సిఎం పరామర్శించడం, ఇదే సమయంలో పుంగనూరులో వైసిపి ఎం.పి. మిథున్‌రెడ్డి, టిడిపి శ్రేణుల మధ్య ఘర్షణలు ఒక్కసారిగా వాతావరణాన్ని వేడెక్కించాయి. కూటమి వచ్చాక 31 మంది హత్యకు గురయ్యారని, హత్యాయత్నాలు, దాడులు, ఆస్తుల ధ్వంసాలకు లెక్కే లేదని ప్రతిపక్ష వైసిపి గణాంకాలు చెబుతోంది. ప్రభుత్వమే కక్ష పూరితంగా దౌర్జన్యాలను ప్రోత్సహిస్తోందని ఆరోపిస్తోంది. ఆ ఘటనలన్నీ వైసిపి ప్రేరేపితమని, ఆ పార్టీయే చేస్తోందని ప్రతిగా కూటమికి చెందిన మంత్రులు, నాయకులు విమర్శిస్తున్నారు. ఒకరిపై ఒకరు ఆరోపణలు ప్రత్యారోపణలు చేసుకోవడం మినహా రెండు పక్షాలూ తమ శ్రేణులను సంయమనం పాటించమని చిత్తశుద్ధితో పిలుపునిచ్చింది లేదు. అదే జరిగితే పరిస్థితులు ఈ తీరుగా ఉండవు. అధినాయకుల వ్యవహారశైలితో కింది స్థాయి కార్యకర్తలు బాహాబాహీ తలపడుతున్నారు. దాంతో గ్రామ సీమలు రాజకీయ కక్షలకు వేదికలై చివరికి శాంతి భద్రతలు అదుపు తప్పే పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రభుత్వంలో ఉన్న వారు బాధ్యతతో మెలగడం చాలా అవసరం. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల అదుపు కర్తవ్యం ప్రభుత్వానిదేనని గుర్తెరగాలి. రెడ్ బుక్ అని మరేదో అని ప్రభుత్వ పెద్దలే రెచ్చగొట్టుడు ఆరోపణలకు దిగడం బాధ్యత అనిపించుకోదు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అరాచక పాలన సాగుతోందని ప్రధాని మోడీకి బహిరంగ లేఖ రాయడం, ఇక్కడి దురాగతాలు వివరించడానికి అపాయింట్‌మెంట్ కోరడం విచిత్రం. రాజ్యాంగం ప్రకారం శాంతి భద్రతల అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిది కాగా ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం వద్ద పంచాయితీ చేయాలని జగన్ ఎందుకు ప్రధానిని అభ్యర్థిస్తున్నారో అర్థం కాదు. గతంలో టిడిపి సైతం ఇదే బాణీ అమలు చేసింది. ఇంకో అడుగు ముందుకేసి ఎన్నికలు సజావుగా జరిపించడానికి కేంద్రం సహాయ సహకారాల కోసమే బిజెపితో పొత్తు పెట్టుకున్నానంది. టిడిపి, వైసిపి ఇరువురూ మోడీకి పెద్దరికం అప్పగించి మధ్యవర్తిత్వం నెరపాలనడం ఆ యా పార్టీలకు మోడీ పట్ల ఉన్న అపార విధేయతను తెలుపుతుంది. గతంలో టిడిపి, ఇప్పుడు వైసిపి ఇరువురూ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న శాంతి భద్రతల్లో బిజెపి జోక్యాన్ని కోరుతున్నారు. వీరిద్దరి బలహీనతనూ బిజెపి తన రాజకీయ లబ్ధికి వాడుకుంటోంది. ప్రతి సంఘటనపైనా రాష్ట్ర పోలీసులను కాదని కేంద్ర దర్యాప్తు సంస్థల విచారణను ఆశ్రయించడం ద్వారా రాష్ట్ర పోలీసు వ్యవస్థ ఎవరు అధికారంలో ఉంటే వారి చెప్పుచేతుల్లో ఉంటుందని టిడిపి, వైసిపి బహిరంగంగానే ప్రకటిస్తున్నాయి. ఆ పార్టీల వైఖరి రాష్ట్ర ప్రజలకు పోలీసులపై అపనమ్మకం కలిగిస్తుంది. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పూచీ పడాలి. రాజకీయ దాడులకు, మహిళలపై ఆగడాలు సహా అన్ని నేరాలను నిరోధించేందుకు చర్యలు చేపట్టాలి. నేరాలకు ఒడిగట్టేవారిని కఠినంగా శిక్షించాలి.

మహనీయుల మాట



ప్రతి దేశంలోనూ కార్మిక వర్గం
తన పోరాటాల ద్వారానే
పోరాడటం గురించి నేర్చుకుంటుంది.
- రోజా లక్సెంబర్గ్



కవిత్వం

కాలాన్ని చిగురింపచేసిన కవి

నిన్న కాక మొన్నే కదా
అభ్యుదయ కవిని మధ్య పెట్టుకుని
ఆనందంగా ఫోటో దిగింది
అదే ఆయనతో ఆఖరి చిత్రమని
ఈ ఉదయపు విషాదవార్త తేల్చింది
గుండెల్లో తన పల్లెని
ఆ నేల మట్టి పరిమళాన్ని ధ్యానిస్తున్నాడు
కనుకే–
ఆమోదంతో పురమందిర పురస్కారసభ కొచ్చి
వూరి గాలి పీల్చుకెళ్ళాడు
వడలిన దేహాన్ని కవుల మధ్య ఆవిష్కరించి
తన సాహితీబలగాన్ని చూసి బలం
పెంచుకెళ్ళాడు
ఇవాళ అందరూ తను మృదుభాషి
అంటున్నారు
కవిత్వం లోనే అమితంగా మాట్లాడాడు కదా
సమకాలీన సమాజం మీద
దు:ఖాన్ని, క్రోధాన్ని, ప్రేమనీ
తన కవిత్వ మూటలో దాచగలిగాడు కదా
కవిత్వ పరిమళాలు గుబాళించినంత కాలం
కవికి మరణ మెక్కడిది..?
జీవిత కాలం పాటు కవిత్వం ఆయుధం
చేసుకుని
కాలాన్ని చిగురింప చేశాడు
ప్రపంచానికి కొత్త చూపునిచ్చి నిలిపాడు
తన సుదీర్ఘ బతుకుయానంలో చూసిన
ఆగని యుద్ధాల్ని గురించి గుండె బాదుకుని
కవిత్వంలో అంతా చెప్పెళ్ళాడుగా..
మరోసారి పచ్చగా మొలకెత్తడానికి
విలక్షణంగా గొంతు విప్పడానికి
వేకువను వెంటబెట్టుకుని
కవిత్వ కాన్వాస్ మీద "నిలువెత్తు సంతకం"
చేసి
నిశ్శబ్దంగా నిష్క్రమించిన కవికి నివాళి..!!
(అభ్యుదయ కవి అడిగోపుల వెంకటరత్నంకు శ్రద్ధాంజలి)

- డా॥ పెరుగు రామకృష్ణ,
సెల్ : 9849230443

జనవాక్యం

డయేరియాపై సత్వర చర్యలు

80, 90వ దశాబ్దాలలో వాంతులు, బేదులతో (డయేరియాతో) ప్రాణాలు పోగొట్టుకున్నారని విన్నాం. ఆనాటికి వైద్యం అందుబాటులో లేకనో, ఆరోగ్య అవగాహన లేకనో ప్రాణాలు పోయాయి. కానీ ఈ 21వ శతాబ్దంలో కూడా డయేరియాతో ప్రాణాలు పోతున్నాయి. ఆశ్చర్యం!! ఇంత వైద్యం అందుబాటులోకి వచ్చినా ప్రాణాలు పోతున్నాయి. నీరు కలుషితం కావడం, అపరిశుభ్రత కారణంగా వస్తున్న డయేరియాను అరికట్టడంలో ప్రధాన బాధ్యత ప్రభుత్వానిది. ఇంత మౌలికమైన సదుపాయాలను కల్పించడంలో ప్రభుత్వ వైఫల్యం చెందుతోంది. ప్రజల ఆరోగ్యం పట్ల బాధ్యతారాహిత్యంగా పాలకులు వ్యవహరించడం సబబు కాదు. డయేరియా వచ్చిన వారు ఆసుపత్రికి వెళ్ళినా అక్కడ మౌలిక వసతులు ప్రశ్నార్థకంగానే వున్నాయి. ప్రైవేటు హాస్పిటళ్లకు, పెద్ద పెద్ద నగరాలకు కూడా తరలివెళ్తున్నారు. ఆరోగ్య అవగాహన ప్రజల్లో పెంచాలి. నీటిని కాచి చల్లార్చుకొని తాగాలి. పరిశుభ్రత పాటించాలి. పురపాలక వ్యవస్థ, పంచాయితీలు తక్షణ చర్యలు చేపట్టాలి.

- తవ్వా సురేష్


చెక్ డ్యామ్‌లను పట్టించుకోరా!

రాష్ట్ర వ్యాప్తంగా గత అయిదు సంవత్సరాలలో చెక్ డ్యాంలను పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పుడు అవి మరమ్మతులకు నోచుకోక, పూడికలతో శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా మిగిలిపోయాయి. ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లో చెక్ డ్యాంలలో చుక్క నీరు నిలవని దుస్థితి నెలకొంది. దీంతో వన్యప్రాణులు దాహార్తి తీర్చుకోవడానికి సమీప గ్రామాల్లోకి వస్తున్నాయి. అలాగే కొద్దిపాటి భూములు కలిగి ఉన్న సన్నకారు రైతులకు ఈ చెక్ డ్యాంలు ఎంతో ఉపయుక్తంగా ఉండేవి. భూగర్భ జలాలు పెరగడానికి దోహదపడేవి. ప్రభుత్వం ఇప్పటికైనా వాటిని మరమ్మతులు చేసి, పూడికలను తొలగించి గరిష్ట స్థాయిలో నీరు నిలవ ఉండేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. ఇందుకు రేగా కూలీలను వినియోగించి పూర్తి స్థాయిలో చెక్ డ్యాంలను పునరుద్ధరించాలి.

- గరిమెళ్ల రామకృష్ణ,
ఏలూరు, ఏలూరు జిల్లా.

వ్యాఖ్య

వ్యూహాత్మక స్వతంత్రత - అమెరికా ముప్పు



అమెరికాకు వున్న ఈ ఉద్దేశం మన జాతీయ ప్రయోజనాలకు అనుగుణమైంది కాదని మోడీ ప్రభుత్వం గుర్తించవలసి వుంది. భారత దేశ వ్యూహాత్మక స్వతంత్రత, స్వతంత్ర విదేశాంగ విధానం అనుసరించడంతో అది ముడిపడి వుంది. చైనాతో విభేదాలు పరిష్కరించుకోవడానికి, ప్రత్యేకించి సరిహద్దు సమస్యపై వున్నవాటిపై కేంద్రీకరించడానికి ఇండియా మరిన్ని చర్యలు తీసుకోవాలి. ఈ రంగంలో గనక ముందడుగు వేయగలిగితే తన వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడానికి ఇండియాకు మరింత సత్తా సమకూరుతుంది. తన జాతీయ ప్రయోజనాలకు దోహదం చేసే అనేక విధానాలను రూపొందించుకునే వీలు కలుగుతుంది. ఇది జరగాలంటే అమెరికాతో రక్షణ ఒప్పందాల నుంచి బయటకు రావలసి వుంటుందని కూడా చెప్పవలసి వుంది.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ప్రధాని నరేంద్ర మోడీ జులై 9, 10 తేదీలలో జరిపిన మాస్కో పర్యటనతో భారత రష్యాల మధ్య వార్షిక శిఖరాగ్ర సమావేశాల ప్రక్రియ తిరిగి మొదలైంది. 2021లో అధ్యక్షుడు పుతిన్ ఢిల్లీ సందర్శన సమయంలో గత పర్యాయం శిఖరాగ్ర సభ జరిగింది. ప్రస్తుత పర్యటనతో భారత రష్యాల వ్యూహాత్మక భాగస్వామ్యం దృఢతరం కావడానికి దారితీసింది. ఈ చర్చల తర్వాత వెలువడిన సంయుక్త విజన్ ప్రకటన గతంలో వలె గాక ఈసారి ఆర్థిక సహకారం, వాణిజ్యంపై దృష్టి కేంద్రీకరించింది. 2030 నాటికి వాణిజ్యాన్ని 10,000 కోట్ల డాలర్లకు పెంచాలని నిర్ణయమైంది. పాశ్చాత్య దేశాల ఆంక్షల నేపథ్యంలో రష్యా నుంచి రాయితీ రేట్లతో భారీ ఎత్తున దిగుమతి అవుతున్న చమురు తాలూకా చెల్లింపుల దృష్ట్యా ఈ లక్ష్యం సాధ్యమయ్యేదే. దాంతో పాటే ఇరు దేశాల సైనిక, సైనిక సాంకేతిక సహకారానికి సంబంధించిన ఇరు ప్రభుత్వాల స్థాయి కమిషన్ తదుపరి సమావేశం ఈ ఏడాది ద్వితీయార్థంలో జరుగుతుందని కూడా ఈ సంయుక్త ప్రకటన వెల్లడించింది. సైనిక సహకారం సంయుక్త పరిశోధన, అభివృద్ధి దిశగా పునర్నిర్దేశితం అవుతుంది. అధునాతన రక్షణ సాంకేతిక పరిజ్ఞానం, వ్యవస్థలను కలసికట్టుగా అభివృద్ధి పర్చడం, ఉమ్మడిగా ఉత్పత్తి చేయడం జరుగుతుంది. ఇది కీలకమైన అడుగు. సైనిక పరికరాల కొనుగోలులో భారత్‌కు రష్యాతో సన్నిహిత బంధాలున్నాయి. ఉమ్మడి ఉత్పత్తి దిశగా ముందుకు పోవడంలో ఇది ముఖ్యమైన అడుగు అవుతుంది.

అమెరికా ప్రతికూల వ్యాఖ్యలు

మోడీ మాస్కో పర్యటన, పుతిన్‌తో శిఖరాగ్ర సమావేశంపై అమెరికా అధ్యక్షుడు బైడెన్ యంత్రాంగం, ప్రతినిధి నుంచి విమర్శలు ఎదురైనాయి. "ఆధారపడదగిన దీర్ఘకాల విశ్వసనీయ భాగస్వామిగా రష్యాపై పందెం కాయడం.. అంత మంచి పందెం కాదు" అని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివాన్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధం విషయంలో రష్యాను సమిష్టి లక్ష్యంగా పెట్టుకుని అంతర్జాతీయంగా అది ఏకాకి అయిపోతుందని చూపించడం కోసం వాషింగ్టన్‌లో నాటో సమావేశం జరుగుతున్న సమయంలోనే మోడీ మాస్కో సందర్శన అమెరికాకు ప్రత్యేకించి ఆగ్రహం తెప్పించింది. నాటో సదస్సు ద్వారా అమెరికా ఏదైతే చాటదలచుకుందో దానికి మోడీ పర్యటన అవరోధం కలిగించింది. ఇండియా ఇప్పుడు తన వ్యూహాత్మక మిత్ర దేశం గనక తదనుగుణంగా ప్రవర్తించాలని అమెరికా సంకేతాలిస్తున్నది.

"భారత అమెరికా రక్షణ రంగ భాగస్వామ్యం ప్రపంచాన్ని ప్రభావితం చేసే అతి ముఖ్యమైన అంశంగా వుంటుంది. అయితే ఏది ఎలా పోయినా అదే చెల్లుబాటవుతుందని మాత్రం అనుకోకూడదు" అని భారతదేశంలో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి హెచ్చరించారు. "భారత దేశం తన వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని ఇష్టపడుతుందని నాకు తెలుసు. కానీ సంఘర్షణ వేళల్లో వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి అనేదేమీ వుండబోదు" అని ఆయన మరింత సూటిగా హెచ్చరిక చేశారు.

భారత దేశం తమతో పెట్టుకున్న వ్యూహాత్మక రక్షణ సంబంధాల పరంగా అనేక అంశాలకు కట్టుబడి వుండాలని మోడీ సర్కారును అమెరికా హెచ్చరిస్తున్నదన్నమాట. అందుకు అనుగుణంగా వ్యవహరించాలని గుర్తు చేస్తున్నది. 2003లో అమెరికా ఇరాక్‌ను దురాక్రమణ చేసినప్పుడు, ఆ దేశ సైనిక చర్యను ఇండియా విమర్శించిన కాలమొకటి వుంది. కానీ ఆ పరిస్థితులు మారిపోయాయి. ఆ సమయంలో భారత దేశం అమెరికాతో ఎలాంటి సైనిక, వ్యూహాత్మక ఒప్పందాలు కుదుర్చుకోలేదు. వ్యూహాత్మక భాగస్వామి కాలేదు. కానీ ఇప్పుడు అమెరికా చెప్పే ప్రకారం అమెరికా నాటో ఉక్రెయిన్‌కు సహాయం చేస్తున్నప్పుడు ఆ విషయంలో ఇండియా వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని ప్రదర్శించడానికి లేదు.

మోడీ సర్కారు నేర్వాల్సిన పాఠాలేంటి?

ఈ ఉదంతంలో మోడీ ప్రభుత్వం నేర్చుకోవలసిన పాఠాలు కొన్ని వున్నాయి. ఆయన పర్యటన ముగిసిన వెంటనే అమెరికా జాతీయ భద్రతా కార్యదర్శి సులివాన్ భారత దేశ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో మాట్లాడారు. క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం జులై చివరలో టోక్యోలో జరపాలనీ, ఆ దేశాల నేతల శిఖరాగ్ర సమావేశం ఏడాది చివరలో నిర్వహించాలనీ ఉభయులూ మాట్లాడుకున్నట్టు వార్తలు వచ్చాయి. ఇండో పసిఫిక్ ప్రాంతంలో తాను పూర్తిగా అమెరికా నేతృత్వ కూటమికే కట్టుబడి వున్నానని మరోసారి భరోసా ఇచ్చేందుకు భారత దేశం ప్రయత్నిస్తున్నది. అమెరికాలో బైడెన్ పాలనా కాలం ప్రస్తుతం ముగింపునకు వచ్చింది. అయినా సరే ఆసియా పసిఫిక్ ప్రాంతంలో తమ వ్యూహాత్మక సైనిక లక్ష్యాలకు కట్టుబడి వుండేలా ఇంకా భారతదేశంపై ఒత్తిడి పెట్టాలని అమెరికా భావిస్తున్నది.

భారత దేశ విదేశాంగ విధానంలో వ్యూహాత్మక విజన్‌లో వైరుధ్యం ఇక్కడే వస్తుంది. ప్రస్తుతం విస్తరించబడిన బ్రిక్స్ కూటమిలోనూ, షాంఘై సహకార కూటమిలోనూ ఇండియా ముఖ్యమైన సభ్య దేశంగా వుంది. దక్షిణాది దేశాల అంతర్జాతీయ కూటములలో ప్రధాన వాణిగా వుండాలని ఇండియా కోరుకుంటూనే వుంది. కాని ఆసియాలో అమెరికా బండికి ముడి వేసుకోవడం ద్వారా దాని వ్యూహాత్మక స్వతంత్రం ఇప్పటికే చాలా వరకూ దెబ్బ తిన్నట్టయింది. ఇక అమెరికాకు సంబంధించినంత వరకూ ఉమ్మడి విలువలు, రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాలు ఒక చోటికి చేరడం వంటి మాటలు ఎన్ని చెప్పినా నిజంగా దాని దృష్టిలో వున్న విలువ ఒకటే. చైనాకు వ్యతిరేక శక్తిగా భారత్‌ను ఉపయోగించుకోవడమే దాని ఉద్దేశం.

చైనాతో పరిష్కారం జరిగితే...

అమెరికాకు వున్న ఈ ఉద్దేశం మన జాతీయ ప్రయోజనాలకు అనుగుణమైంది కాదని మోడీ ప్రభుత్వం గుర్తించవలసి వుంది. భారత దేశ వ్యూహాత్మక స్వతంత్రత, స్వతంత్ర విదేశాంగ విధానం అనుసరించడంతో అది ముడిపడి వుంది. చైనాతో విభేదాలు పరిష్కరించుకోవడానికి, ప్రత్యేకించి సరిహద్దు సమస్యపై వున్నవాటిపై కేంద్రీకరించడానికి ఇండియా మరిన్ని చర్యలు తీసుకోవాలి. ఈ రంగంలో గనక ముందడుగు వేయగలిగితే తన వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడానికి ఇండియాకు మరింత సత్తా సమకూరుతుంది. తన జాతీయ ప్రయోజనాలకు దోహదం చేసే అనేక విధానాలను రూపొందించుకునే వీలు కలుగుతుంది. ఇది జరగాలంటే అమెరికాతో రక్షణ ఒప్పందాల నుంచి బయటకు రావలసి వుంటుందని కూడా చెప్పవలసి వుంది.


(జులై 17 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

సమస్య

యజమానుల లాభాలకు కార్మిక హక్కులు, ప్రాణాలు బలి



రాష్ట్రంలో ఎక్కడా కనీస వేతనాలు, పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ తదితర హక్కులు అమలు కావు. కర్మాగారాల ప్రమాదాల్లో కార్మికులు పిట్టల్లా రాలిపోతున్నారు. మొన్న ఎన్‌టిఆర్ జిల్లా సిమెంట్ కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో నలుగురు, నిన్న అదే జిల్లా దొనబండ క్వారీ పేలుడులో ముగ్గురు, ఆ తరువాత అనకాపల్లి జిల్లా ఫార్మా కంపెనీ రియాక్టర్ పేలుడు ప్రమాదంలో ఒకరు మరణించారు. 2021 నుండి 2023 వరకు కేవలం మూడు సంవత్సరాల్లో చోటుచేసుకున్న కర్మాగార ప్రమాదాల్లో 28 మంది ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఒక పక్కన కార్మిక హక్కులు అమలు చేయకుండా శ్రమ దోపిడీ కొనసాగుతోంది. మరో పక్క యజమానుల లాభాల కోసం, వారి వ్యాపారాన్ని సులభతరం చేయడం కోసం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) పాలకులు తనిఖీలు ఎత్తివేసి కార్మికుల ప్రాణాలను బలిస్తున్నారు.



పి.అజయకుమార్

ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాల పేరుతో పాలక పార్టీలు ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయి. ఇన్‌స్పెక్షన్ రాజ్ (తనిఖీల రాజ్యం)ను ఎత్తివేయాలనే సాకుతో తనిఖీలను నామమాత్రం చేశాయి. ప్రైవేట్ సంస్థలకు తనిఖీలు, సేఫ్టీ ఆడిట్‌లు చేసే అవకాశమిచ్చాయి. వాస్తవంగా ప్రైవేట్ సంస్థలు తనిఖీలకు వెళ్లవు. సేఫ్టీ ఆడిట్‌ను కూడా నిర్వహించవు. ఆఫీసులో కూర్చొని సర్టిఫికెట్లు తయారు చేస్తాయి.

వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రైవేట్ థర్డ్‌పార్టీ సేఫ్టీ ఆడిట్ టీమ్‌ల దగ్గర ముడుపులు తీసుకుని వీరి సర్టిఫికెట్లకు ప్రభుత్వ అధికారులు ఆమోదం తెలిపారని నేటి టిడిపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ కార్మికశాఖా మంత్రి వాసంసెట్టి సుభాష్ ఆరోపించారు. అందుకే అల్ట్రా టెక్ సిమెంట్ ఫ్యాక్టరీ, విజయవాడ థర్మల్ పవర్ ప్లాంట్, అనకాపల్లి కెమికల్ ప్లాంట్, సామర్లకోట కాంక్రీట్ మిక్స్ యూనిట్‌లో ప్రమాదాలు జరిగాయన్నారు. కానీ ఇటువంటి మోసపూరిత థర్డ్ పార్టీ ఆడిట్‌ను తమ ప్రభుత్వం రద్దు చేస్తుందా? లేదా? అనే మాట చెప్పలేదు.

రాష్ట్రంలో ఎక్కడా కనీస వేతనాలు, పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ తదితర హక్కులు అమలు కావు. కర్మాగారాల ప్రమాదాల్లో కార్మికులు పిట్టల్లా రాలిపోతున్నారు. మొన్న ఎన్‌టిఆర్ జిల్లా సిమెంట్ కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో నలుగురు, నిన్న అదే జిల్లా దొనబండ క్వారీ పేలుడులో ముగ్గురు, ఆ తరువాత అనకాపల్లి జిల్లా ఫార్మా కంపెనీ రియాక్టర్ పేలుడు ప్రమాదంలో ఒకరు మరణించారు. 2021 నుండి 2023 వరకు కేవలం మూడు సంవత్సరాల్లో చోటుచేసుకున్న కర్మాగార ప్రమాదాల్లో 28 మంది ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఒక పక్కన కార్మిక హక్కులు అమలు చేయకుండా శ్రమ దోపిడీ కొనసాగుతోంది. మరో పక్క యజమానుల లాభాల కోసం, వారి వ్యాపారాన్ని సులభతరం చేయడం కోసం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) పాలకులు తనిఖీలు ఎత్తివేసి కార్మికుల ప్రాణాలను బలిస్తున్నారు.

ప్రమాదాలు జరిగిన తరువాత ఎప్పటిలాగే...కార్మికుల ప్రాణాలకు విలువగట్టడం, అధికారుల హడావిడి, విచారణలు కొనసాగుతాయి. కానీ బాధ్యతారహితంగా వ్యవహరించి కార్మికుల ప్రాణాలు తీసిన యజమానులను మాత్రం శిక్షించరు. అల్ట్రా టెక్ సిమెంట్ కర్మాగార యజమానిని ఇంత వరకు అరెస్టు చేయలేదు. కార్మికుల హక్కులకు, ప్రాణాలకు, భద్రతకు ఎందుకు విలువ లేకుండా పోతోంది? లోపం ఎక్కడ ఉంది? ఎవరిదీ పాపం?

ఫ్యాక్టరీల చట్టంలో పని ప్రదేశంలో కార్మికుల భద్రతకు, ఆరోగ్యానికి, సంక్షేమానికి యజమానులు తీసుకోవాల్సిన చర్యలు అన్నీ ఉన్నాయి. వాటిని గట్టిగా అమలు చేయకుండా... వ్యాపారాన్ని సులభతరం చేయడమనే (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) పేరుతో తనిఖీలు లేకుండా లేదా నామమాత్రం చేస్తూ జీవోలు ఇచ్చిన పాలకులదే అసలు పాపం.

నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబు నాయుడు కార్మిక వ్యతిరేక మార్పులను అమలు చేయటంలో ప్రథముడు అన్న సంగతి అందరికీ తెలుసు. 2001, 2002 సంవత్సరాల్లోనే తనిఖీలను నామమాత్రం చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఆ తర్వాత 2014లో మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం పూర్తి మెజార్టీతో అధికారంలోకి వచ్చింది. వచ్చీ రావటంతోనే తనిఖీలకు చెల్లు చీటీ ఇస్తూ రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీ చేసింది.

మోడీ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 2014–2019లో టిడిపి, 2019–2024లో వైసిపి ప్రభుత్వాలు జీవోలు జారీ చేశాయి. వీటి కారణంగానే కార్మికులు తమ విలువైన ప్రాణాలు కోల్పోతున్నారు. ఆ జీవోల్లో ఏముంది? వచ్చిన మార్పులు ఏమిటి?

2015లో మోడీ ప్రభుత్వ పారిశ్రామిక విధానం, ప్రోత్సాహక శాఖ (డిఐపిపి) మార్గదర్శకాలను అనుసరించి టిడిపి ప్రభుత్వం 6 కార్మిక చట్టాలకు ఒకే యాన్యువల్ రిటర్న్ సమర్పించే అవకాశమిస్తూ కొత్త చట్టాన్ని తెచ్చింది. ఇదే ప్రభుత్వం 2019లో ఫ్యాక్టరీల చట్టంతో సహా మరో 6 చట్టాలను చేర్చి 12 చట్టాలకు ఒకే రిటర్న్ సమర్పించే అవకాశమిచ్చింది. ఈ చట్టం ప్రకారం సంస్థ వివరాలు ఇవ్వటంతోపాటు కార్మిక చట్టాలన్నిటినీ అమలు చేస్తున్నామని యజమానులు సొంత సర్టిఫికెట్‌ను (సెల్ఫ్ సర్టిఫికేషన్) సమర్పిస్తే సరిపోతుంది.

2020లో మోడీ ప్రభుత్వ మార్గదర్శకాలపై గత వైసిపి ప్రభుత్వం మరో పెద్ద ముందడుగు వేసింది. మొత్తం కార్మిక చట్టాలన్నిటినీ సొంత సర్టిఫికెట్ (సెల్ఫ్ సర్టిఫికేషన్) ఇచ్చే పద్ధతి కిందికి తెచ్చింది.

2019లో టిడిపి ప్రభుత్వం ఇచ్చిన జీవో 62 ప్రకారం కొత్తగా ప్రారంభించిన సంస్థల్లో 3 సంవత్సరాల వరకు తనిఖీలు ఉండవు. ప్రత్యేక ఆర్థిక మండళ్ల (ఎస్ఈజెడ్‌లు), ఎగుమతి ఆధారిత జోన్ల (ఈపీజెడ్‌లు)లో ఉండే సంస్థలకు తనిఖీలు ఉండవు. అన్ని చట్టాలకు కలిపి యాన్యువల్ రిటర్న్ సమర్పించిన సంస్థలకు కూడా మూడు సంవత్సరాలు తనిఖీల నుండి మినహాయింపు ఉంది. అయితే ఈ సంస్థలు కార్మిక చట్టాలను అతిక్రమించకూడదు. అయితే దీన్ని ఎవరు నిర్ధారిస్తారు? ఉద్యోగాలు పోతాయనే భయంతో కార్మికులు కూడా ముందుకు రారు. ఒకసారి తనిఖీ జరిగిన సంస్థలో మరో రెండు సంవత్సరాల వరకు తనిఖీలు ఉండవు.

మే 31, 2016లో టిడిపి ప్రభుత్వం ఇచ్చిన జీవో 27 మోడీ విధానాల అమలుకు పరాకాష్ట. దీని కొనసాగింపుగానే టిడిపి, వైసిపి ప్రభుత్వాలు మరి కొన్ని జీవోలు తెచ్చాయి. వీటన్నిటికీ ప్రేరణ, మార్గదర్శకం మోడీ ప్రభుత్వానిదే. ఈ జీవో ప్రకారం కంప్యూటర్‌లో నమోదైన సంస్థల వరకే తనిఖీలు ఉంటాయి. ఆ తనిఖీలు కూడా కంప్యూటర్ యాదృచ్ఛికంగా ఎంపిక చేసే (రాన్‌డమ్ బేస్డ్ ఇన్‌స్పెక్షన్లు) కొన్ని సంస్థల వరకే ఉంటాయి. ఆఫ్‌లైన్‌లో తనిఖీలకు వెళ్లటం నిషేధం.

ప్రైవేట్ థర్డ్ పార్టీ సంస్థల తనిఖీలకు, సేఫ్టీ ఆడిట్‌లకు ఈ జీవో అవకాశమిచ్చింది. షెడ్యూల్డు ఎంప్లాయ్‌మెంట్లలో ఉన్న 10 రకాల సంస్థలు, 300 మంది కార్మికులకు పైగా పని చేసే సంస్థలు, పెట్రోలు, ఆయిల్ టెర్మినల్లు, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ఫ్యాక్టరీల్లో 20 నుండి 149 మంది వరకు కార్మికులు ఉన్నవి, ఇతర ఫ్యాక్టరీల్లో 150కి పైన వెయ్యి లోపు కార్మికులున్న వాటిని ప్రైవేట్ సంస్థల తనిఖీలకు, సేఫ్టీ ఆడిట్‌కు అప్పజెప్పారు. ఈ తనిఖీలు కూడా రెండు సంవత్సరాలకు ఒకసారి మాత్రమే.

ప్రమాదం అత్యధికంగా జరిగే ఫ్యాక్టరీలు, వెయ్యి మందికి పైగా కార్మికులు పనిచేసే ఫ్యాక్టరీలు, వృత్తి రుగ్మతలకు అవకాశం ఉన్న ఫ్యాక్టరీలకు, షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్లలో 38 రకాల సంస్థల్లో కూడా లేబరు అధికారులు సంవత్సరానికి ఒకసారి మాత్రమే తనిఖీలకు వెళ్లాలి. రిస్క్ ఎక్కువ ఉన్నా, మధ్యస్థంగా ఉన్నా, తక్కువగా ఉన్నా కంప్యూటర్ రాన్‌డమ్‌గా ఎంపిక చేసిన సంస్థలకు మాత్రమే తనిఖీలకు వెళ్లాలి.

2001లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తనిఖీలను నామమాత్రం చేస్తూ ఇచ్చిన జీవో 40 ప్రకారం తనిఖీలకు వెళ్లబోయే ముందు యజమానులకు తెలియజేయాలి. దీనిపై పెద్ద దుమారం చెలరేగింది. దాంతో జీవో 40ని రద్దు చేసి జీవో 33 ఇచ్చారు. ఈ కొత్త జీవోలో యజమానులకు ముందుగా సమాచారం ఇవ్వాలని లేనప్పటికీ...తనిఖీలకు పరిమితులను మాత్రం యథాతథంగా కొనసాగించారు. తనిఖీకి వెళ్లే సంస్థకు ముందుగా సమాచారం ఇవ్వాలనే నిబంధనను...మోడీ ప్రభుత్వ ఆదేశానుసారం 2019 మార్చిలో టిడిపి ప్రభుత్వం ఇచ్చిన జీవో 62లో మరలా చేర్చారు. 2001 నుండి ఇప్పటి వరకూ కూడా ఆకస్మిక తనిఖీలకు చెల్లు చీటీ ఇచ్చారు. పాలక వర్గ పార్టీలు ఏవి అధికారంలోకి వచ్చినా...కార్మిక వ్యతిరేక సంస్కరణల అమలులో ముందుంటాయని మోడీ, చంద్రబాబు, జగన్ ప్రభుత్వాలు రుజువు చేశాయి.

చట్టాలు ఎన్ని ఉన్నా, వాటి అమలు కీలకం. కార్మిక చట్టాల అమలు, తనిఖీ నిర్వీర్యమైతే కార్మికుల హక్కులు, ప్రాణాలు గాలికి కొట్టుకు పోతాయి. సులభతర వ్యాపారం పేరుతో తనిఖీలను నామమాత్రం చేయటమంటే...యజమానుల లాభాలకు కార్మిక హక్కులను, ప్రాణాలను బలి ఇవ్వటమే. ఈ పాపానికి పాల్పడుతున్న పాలకుల విధానాలపై కార్మికులు ఐక్యంగా పోరాడాలి. శ్రమ దోపిడీ నుండి బైటపడి కార్మికులు తమ హక్కులను కాపాడుకోవాలి.

(వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు)

పాలస్తీనాలో ఇజ్రాయిల్‌ దురాక్రమణ చట్ట విరుద్ధం

అంతర్జాతీయ న్యాయస్థానం



హేగ్‌/ గాజా : పాలస్తీనా భూభాగాలపై దశాబ్దాలుగా చేస్తున్న ఇజ్రాయిల్‌ దురాక్రమణ చట్టవిరుద్ధమని అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె) శుక్రవారం పేర్కొంది. ఐక్యరాజ్య సమితి జనరల్‌ అసెంబ్లీ అభ్యర్థన మేరకు ఐసిజె ఈ సలహా పూర్వక అభిప్రాయాన్ని ప్రకటించింది. దురాక్రమణకు పాల్పడం ద్వారా ఇజ్రాయిల్‌ తన హోదాను దుర్వినియోగం చేయడమేనని 15 మంది న్యాయమూర్తుల ప్యానెల్‌ స్పష్టం చేసింది. తూర్పు జెరూసలేంతో సహా పాలస్తీనా భూభాగాలలో ఇజ్రాయిల్‌ విధానాల గురించి జనరల్‌ అసెంబ్లీ చట్టపరమైన స్పష్టత కోరింది. 'పాలస్తీనా భూభాగాల్లో ఇజ్రాయిల్‌ తన ఉనికిని కొనసాగించడం చట్ట విరుద్ధమని కోర్టు గుర్తించింది' అని ఐసిజె అధ్యక్ష న్యాయమూర్తి నవాఫ్‌ సలాం తెలిపారు. వీలైనంత త్వరగా ఇజ్రాయిల్‌ తన ఆక్రమణలకు అంతం పలకాలని తెలిపారు. ఐసిజె అభిప్రాయాన్ని ఇజ్రాయిల్‌ ప్రధానమంత్రి బెంజమిన్‌ నెతన్యాహు ఖండించారు. 'అబద్ధాల నిర్ణయం' అభివర్ణించారు.

24 గంటల వ్యవధిలో 54 మంది మృతి

ఐదేళ్ల రోజుల్లో ఇజ్రాయిల్‌ తన దాడులను ఉధృతం చేసింది. వరుసగా నాలుగు స్కూళ్లపై బాంబు దాడులు జరిపి 90మంది ప్రాణాలను బలిగొని వారం రోజులు కూడా గడవకముందే గురువారం మరో 54మంది ఈ దాడుల్లో చనిపోయారని పాలస్తీనా ఆరోగ్య శాఖ తెలిపింది. విరామం లేకుండా మృతదేహాలు, క్షతగాత్రులు ఆస్పత్రులకు వస్తూనే వుండడంతో దక్షిణ గాజాలోని ఆరోగ్య కేంద్రాలన్నీ కూడా కిక్కిరిసి పోయి వున్నాయని అంతర్జాతీయ రెడ్‌ క్రాస్‌ కమిటీ తెలిపింది. డెర్‌ ఎల్‌ బాలాహ్‌ పట్టణంలో అల్‌ అక్సా ఆస్పత్రిలో నేలపై తెల్ల దుప్పట్లలో చుట్టిన మృత దేహాలు పడి వుండడం టెలివిజన్‌ దృశ్యాల్లో కనిపిస్తున్నాయి.

ఇజ్రాయిల్‌ పార్లమెంట్‌ తీర్మానంపై ఆందోళన

పాలస్తీనా దేశాన్ని వ్యతిరేకిస్తూ గురువారం ఇజ్రాయిల్‌ పార్లమెంట్‌ ఓటు వేసింది. దాన్నొక ముప్పుగా పేర్కొంది. దీనివల్ల ఈ ప్రాంతం మొత్తం అస్థిరంగా మారుతుందని పేర్కొంది. 120మంది సభ్యులు గల పార్లమెంట్‌లో 68-9 ఓట్లతో తీర్మానం ఆమోదం పొందింది. ఈ ఓటింగ్‌ను పాలస్తీనా నాయకత్వం, అంతర్జాతీయ సమాజం తీవ్రంగా విమర్శించింది. వచ్చే బుధవారం అమెరికా కాంగ్రెస్‌లో ఇజ్రాయిల్‌ ప్రధాని నెతన్యాహు ప్రసంగించనున్న నేపథ్యంలో ఈ ఓటును ఇజ్రాయిల్‌ వైఖరికి చిహ్నంగా చూస్తున్నారు. పాలస్తీనా అథారిటీ, జోర్డాన్‌ తీర్మానాన్ని ఖండించాయి. ఇజ్రాయిల్‌ పాలక సంకీర్ణం మొత్తంగా ఈ ప్రాంతాన్ని సంక్షోభంలోకి నెడుతోందని పాలస్తీనా అథారిటీ విమర్శించింది. ఈ ఓటు అంతర్జాతీయ చట్టాలను తీవ్రంగా ఉల్లంఘిస్తోందని జోర్డాన్‌ విమర్శించింది. అంతర్జాతీయ సమాజానికి ఒక సవాలును విసురుతోందని వ్యాఖ్యానించింది. ఫ్రాన్స్‌ దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది.

గుటెరస్‌ దిగ్భ్రాంతి

1967 ముందునాటి సరిహద్దులతో పాలస్తీనా దేశం ఏర్పాటే ఈ సమస్యకు పరిష్కారమార్గమని పేర్కొంటూ దశాబ్దాలుగా సమస్యను పరిష్కరించడానికి ఐక్యరాజ్య సమితి కృషి చేస్తోంది. కానీ ఈ తరుణంలో ఇజ్రాయిల్‌ పార్లమెంట్‌ ఈ రీతిన ఓటింగ్‌ చేయడం పట్ల యుఎన్‌ చీఫ్‌ గుటెరస్‌ చాలా నిరాశ చెందారని ఆయన ప్రతినిధి స్టీఫెన్‌ డుజారిక్‌ తెలిపారు. ఇటువంటి చర్యలు తీసుకోవడం ద్వారా రెండు దేశాల ఏర్పాటు పరిష్కారాన్ని కొట్టివేయలేరని అన్నారు. గురువారం యూరోపియన్‌ పార్లమెంట్‌ను ఉద్దేశించి ఇయు చీఫ్‌ ఉర్సులా వాన్‌ డెర్‌ లేయన్‌ ప్రసంగిస్తూ, గాజా ప్రజలు, మొత్తంగా మానవాళి ఇంక ఈ దారుణాలను సహించలేరని అన్నారు.

శరణార్థుల సాయాన్ని పునరుద్ధరించిన బ్రిటన్‌

పాలస్తీనా శరణార్థుల కోసం పనిచేస్తున్న ఐక్యరాజ్య సమితి సంస్థ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ)కు నిధులు అందించడాన్ని పునరుద్ధరించనున్నట్లు బ్రిటన్‌ కొత్త లేబర్‌ ప్రభుత్వం ప్రకటించింది. యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ నిధుల సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నామని బ్రిటన్‌ విదేశాంగ శాఖ మంత్రి డేవిడ్‌ లామీ శుక్రవారం పార్లమెంట్‌కు చెప్పారు. గాజాకు మానవతా సాయం అందజేయడంలో ఐక్యరాజ్యసమితి సంస్థ చాలా కీలకమైనదని చెప్పారు. కొత్త నిధుల నుండి 2.70 కోట్ల డాలర్లను అందచేస్తున్నట్లు తెలిపారు.

పాలస్తీనాకు సంఘీభావం తెలిపినవారిపై కేసులు ఉపసంహరించాలి

- **సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్‌**

న్యూఢిల్లీ : మొహర్రం ప్రదర్శన సందర్భంగా పాలస్తీనా పతాకాలను చేబూని ప్రదర్శించిన వారిపై నమోదు చేసిన క్రిమినల్‌ కేసులను తక్షణమే ఉపసంహరించాలని సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్‌ చేసింది. జమ్ము కాశ్మీర్‌, బీహార్‌, మధ్యప్రదేశ్‌, జార్ఖండ్‌ తదితర రాష్ట్రాల్లో యుఎపిఎ, భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్‌)ల్లోని కఠినమైన సెక్షన్ల కింద ఈ కేసులు నమోదు చేశారు. బిజెపి, విహెచ్‌పి నేతలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకే ఈ కేసులను నమోదు చేశారని పొలిట్‌బ్యూరో పేర్కొంది. కేసులు నమోదైన ఈ రాష్ట్రాల్లో చాలావరకు బిజెపి దాని మిత్రపక్షాల పాలనలో వున్నవి లేదా కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష పాలనలో వున్నవే. ఒకవైపు పాలస్తీనా దేశానికి మద్దతునిస్తున్నామని కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం చెప్పుకుంటోంది. మరోవైపు పాలస్తీనాకు సంఘీభావం చెప్పడాన్ని నేరంగా చూపుతూ ఇలా కేసులు నమోదు చేయడం చూస్తుంటే వారి నిజ స్వరూపం బట్టబయలైందని పొలిట్‌బ్యూరో విమర్శించింది. భారతీయులు పాలస్తీనాకు మద్దతునివ్వడాన్ని బిజెపి సహించలేకపోతోందని పేర్కొంది. ఈ కేసులను తక్షణమే ఉపసంహరించాలని, పాలస్తీనాకు మద్దతు తెలిపిన కారణంగా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌ చేసింది. కేంద్ర ప్రభుత్వం పాలస్తీనాకు నిర్ద్వంద్వంగా సంఘీభావాన్ని తెలియచేయాలని కోరింది. ఆక్రమించిన పాలస్తీనా భూభాగాలన్నింటి నుండి వైదొలగి, 1967 ముందు నాటి సరిహద్దులతో, తూర్పు జెరూసలేం రాజధానిగా ప్రత్యేక దేశంగా పాలస్తీనాకు స్వయంప్రతిపత్తి పునరుద్ధరించాల్సిందిగా ఇజ్రాయిల్‌ను కోరాలని డిమాండ్‌ చేసింది.

బెంబేలెత్తించిన సాఫ్ట్‌వేర్‌, ఇంటర్నెట్‌ వైఫల్యాలు



న్యూఢిల్లీ : మైక్రోసాఫ్ట్‌ అజూర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ప్రపంచవ్యాప్తంగా అనేక రంగాల్లో సేవలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. సాఫ్ట్‌వేర్‌, ఇంటర్నెట్‌ వైఫల్యాలు ఇదే తొలిసారి కాదు. గతంలోనూ కల్లోలం రేపిన ఘటనలు అనేకం ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ప్రభావం చూపిన అలాంటి వైఫల్యాల్లో కొన్ని..

డివైఎన్‌పై సైబర్‌ఎటాక్‌ (2016)

డివైఎన్‌కు వ్యతిరేకంగా సైబర్‌ దాడులు జరగడంతో అమెరికా, యూరప్‌ల్లో ఇంటర్నెట్‌ సేవలకు అంతరాయం కలిగింది. ఒక మాల్‌వేర్‌ ఉపయోగించి జరిపిన ఈ దాడితో డివైఎన్‌ సర్వర్‌ స్థంభించిపోయింది.

బ్రిటీష్‌ ఎయిర్‌వేస్‌ ఐటి వైఫల్యం (2017)

ఊహించని రీతిలో జరిగిన బ్రిటీష్‌ ఎయిర్‌వేస్‌ ఐటి వైఫల్యంతో స్వర్వర్లకు విద్యుత్‌ సరఫరా నిలిచింది. దీంతో ఆ సంస్థ విమాన సర్వీసులు నిలిచిపోయి దాదాపు 75 వేల మంది ప్రయాణీకులపై ప్రభావం పడింది.

ఫేస్‌బుక్‌ లాగిన్‌ సమస్య (2019)

ఫేస్‌బుక్‌, ఈ సంస్థకు చెందిన ఇన్‌స్టాగ్రామ్‌ వంటి యాప్‌లు 2019లో స్థంభించిపోయాయి. తమ ఖాతాల్లోకి లాగిన్‌ చేయలేకపోతున్నామని యూజర్‌లు ఆరోపించారు. ఈ అంతరాయాలకు 'సర్వర్‌ కాన్ఫిగరేషన్‌ మార్పు'ను సంస్థ కారణంగా పేర్కొంది.

గూగూల్‌ క్రాష్‌ (2020)

స్టోరేజ్‌ కోటా సమస్యతో జిమెయిల్‌, డ్రైవ్‌, యూట్యూబ్‌ వంటి గూగూల్‌ అప్లికేషన్స్‌ క్రాష్‌ను ఎదుర్కొన్నాయి. అప్పటికే ఉన్న స్టోరేజ్‌ స్పేస్‌ నిండిపోయినప్పుడు సిస్టమ్‌లు ఈ అప్లికేషన్స్‌ కోసం అదనపు స్థలాన్ని సృష్టించనప్పుడు ఇలాంటి సమస్య ఏర్పడుతుంది.

ఫాస్టీ (2021)

క్లౌడ్‌ కంప్యూటింగ్‌ సర్వీస్‌ ప్రొవైడర్‌ ఫాస్టీ కార్యకలాపాలకు బగ్‌ కారణంగా అంతరాయం ఏర్పండింది. దీంతో అంతర్జాతీయ మీడియా సంస్థలు, ప్రభుత్వాలు, స్పూటిఫీ, అమజాన్‌ వంటి ఇంటర్నెట్‌ సర్వీసుల వైబ్‌సైట్లలో సమస్యలు ఏర్పడ్డాయి.

అకామై (2021)

మరొక క్లౌడ్‌ కంప్యూటింగ్‌ సర్వీస్‌ ప్రొవైడర్‌ అకామై ఒక సాఫ్ట్‌వేర్‌ అప్‌డేట్‌ చేస్తున్న సమయంలో ఒక బగ్‌ కారణంగా అంతరాయాలకు గురయింది. దీంతో ప్రముఖ విమానయాన సంస్థల వైబ్‌సైట్లు, అమెజాన్‌, ఎయిర్‌బంబ్‌, హోమ్‌ డిపార్ట్‌మెంట్‌ వంటి సంస్థలు సమస్యలు ఎదుర్కొన్నాయి. ఈ సమస్య దాదాపు గంట పాటు కొనసాగింది.

జూమ్‌ (2022)

బ్యాక్‌ఎండ్‌ సిస్టమ్‌ల్లో, ట్రాఫిక్‌ నిర్వహణల్లో సమస్యలు కారణంగా జూమ్‌ మీటింగ్స్‌ల్లోకి యూజర్లు ప్రవేశించలేకపోయేవారు. దాదాపు గంట పాటు సమస్య కొనసాగింది.

అమెజాన్‌ వెబ్‌ సర్వీసెస్‌ (2022)

అమెజాన్‌ వెబ్‌ సర్వీసెస్‌ (ఎడబ్ల్యుఎస్‌) 2022లో రెండు భారీ అంతరాయలను ఎదుర్కొంది. దీనికారణంగా అమెరికా-ఈస్ట్‌ 2 ప్రాంతంలో సంబంధాలను ఎడబ్ల్యుఎస్‌ కోల్పోయింది. ఎడబ్ల్యుఎస్‌ అనేది కూడా క్లౌడ్‌ సర్వీస్‌ ప్లాట్‌ఫారం.

క్లౌడ్‌ఫేర్‌ (2023)

విద్యుత్‌ వైఫల్యం కారణంగా క్లౌడ్‌ఫేర్‌ రెండు రోజుల పాటు పని చేయడం నిలిచిపోయింది. మూడు డేటా సెంటర్ల సర్వీసులకు ఈ క్లౌడ్‌ఫేర్‌ ఫ్లాట్‌ఫారంను ఉపయోగిస్తారు. ఇందులో ఒక డేటా సెంటర్‌లో విద్యుత్‌ వైఫల్యం ఎదురుకావడం క్లౌడ్‌ఫేర్‌పై ప్రభావం చూపింది.

ఇంటర్నెట్‌ ప్రపంచంలో పెద్ద కుదుపు !

(మొదటి పేజీ తరువాయి)

సేవలను పునరుద్ధరించామని టెక్‌ దిగ్గజం తెలిపింది. ఇండియన్‌ కంప్యూటర్‌ ఎమర్జన్సీ రెస్పాన్స్‌ టీమ్‌, సిఇఆర్‌టి-ఇన్‌ ఈ సంఘటనకు 'క్రిటికల్‌' అన్న హెచ్చరికను జారీ చేసింది. అయితే భారత్‌లో స్టాక్‌ మార్కెట్లయిన ఎన్‌ఎస్‌ఇ, బిఎస్‌ఇల కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం కలగలేదు. మైక్రోసాఫ్ట్‌తో ప్రభుత్వం మాట్లాడుతోందని, సమస్యను గుర్తించారని, త్వరలోనే పరిష్కారమవుతుందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ తెలిపారు.

అంతర్జాతీయ సైబర్‌ సెక్యూరిటీ కంపెనీ అయిన కాస్పర్‌స్కై, ఒక ప్రకటన చేస్తూ దీన్ని సీరియస్‌ సమస్యగా పేర్కొంది. దీన్ని పరిష్కరించడానికి పట్టే సమయాన్ని అంచనా వేయడం కష్టమని వ్యాఖ్యానించింది. ఇదేమీ సైబర్‌దాడి లేదా భద్రతా వైఫల్యం కాదని క్రౌడ్‌ స్ట్రైక్‌ ప్రకటించింది.

విజయవాడ నుండి విమాన సర్వీసులు ఆలస్యం

గన్నవరం : మైక్రోసాఫ్ట్‌ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక లోపం వల్ల విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి పలు విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇక్కడి విమానాశ్రయం నుండి 23 విమాన సర్వీసులు నడుస్తుండగా, ఏడు సర్వీసులు ఆలస్యంగా బయలుదేరాయి. ఈ విషయాన్ని విమానాశ్రయం డైరెక్టర్‌ లక్ష్మీకాంత్‌ రెడ్డి తెలిపారు.

ఉత్తరాఖండ్‌లోనూ 'విద్వేష' ఉత్తర్వులు

లక్నో : మైనార్టీలపై విద్వేష జాఢ్యంతో ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌ పోలీసులు జారీ చేసిన దుర్మార్గమైన ఉత్తర్వులపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో వాటిని ఏమాత్రం పట్టించుకోని బిజెపి పాలకులు ఆ ఉత్తర్వుల విస్తృతిని మరింత పెంచారు. ఈ నెల 22న ప్రారంభం కానున్న కన్వర్‌ యాత్ర సందర్భంగా యాత్ర సాగే మార్గంలో హోటళ్లు, చిన్నచిన్న దుకాణాల నిర్వాహకులు తమ పేర్లను ప్రముఖంగా కనపడేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నది ముజఫర్‌నగర్‌ పోలీసులు జారీ చేసిన ఉత్తర్వుల సారాంశం. ఇలా బోర్డులు ఏర్పాటు చేస్తే ముస్లింలను, క్రైస్తవులను సులువుగా గుర్తించి వారి వద్ద కాకుండా కేవలం హిందువుల వద్దే కొనుగోళ్లు చేసేందుకు వీలుకల్పించే దురుద్దేశంతోనే ఈ ఉత్తర్వులు జారీ చేశారన్నది యథార్థం. విద్వేష జాఢ్యంతో జారీ చేసిన ఈ ఉత్తర్వుల తరహాలోనూ ఉత్తరప్రదేశ్‌ అంతటా అమల్జేస్తామని యుపిలోని యోగి ఆదిత్యనాథ్‌ సర్కార్‌ ప్రకటించగా..ఇప్పుడు యుపితో పాటు ఉత్తరాఖండ్‌లోనూ ఇలాంటి ఉత్తర్వులు జారీ చేస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్‌ సింగ్‌ ధామి శుక్రవారం వెల్లడించారు. దుర్మార్గమైన ఈ ఉత్తర్వులను సిపిఎం, ఇతర ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించిన సంగతి తెలిసిందే. బిజెపి మిత్రపక్షం జెడి(యు) కూడా ఈ ఉత్తర్వులను తప్పుబట్టింది.

పార్లమెంట్‌ ముందుకు ఆరు బిల్లులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్‌ ముందుకు ఆరు కొత్త బిల్లులకు తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 22న ప్రారంభం కానున్న బడ్జెట్‌ సమావేశాలు ఆగస్టు 12న ముగుస్తాయి. ఇదే నెల 23న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు లోక్‌సభ సెక్రటేరియట్‌ శుక్రవారం ఒక బులిటెన్‌ విడుదల చేసింది. బడ్జెట్‌ రోజున ప్రశ్నోత్తరాలు, జీరో అవర్‌ ఉండవని పేర్కొంది. అయితే ఈ సమావేశాల్లో 90 ఏళ్ల నాటి ఎయిర్‌క్రాఫ్ట్‌ చట్టాన్ని సవరించి, దాని స్థానంలో విమానయాన రంగాన్ని పూర్తిగా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు వీలు కల్పించే నిబంధనలతో సవరణ చట్టం తీసుకురానున్నారు. ఈ బిల్లుతో సహా ఆరు కొత్త బిల్లులను ప్రవేశపెట్టడానికి కేంద్రం జాబితా చేసింది.

దాడులపై 24న ఢిల్లీలో ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

పెడుతున్నారని తెలిపారు. వినుకొండలో ఒక సామాన్య కార్యకర్త రషీద్‌ను అతి కిరాతకంగా నడిరోడ్డుపై ప్రజల సమక్షంలో హత్య చేస్తే ఇది వ్యక్తిగత కక్షలకు సంబంధించిన ఘటన అని పోలీసు అధికారులు, టిడిపి నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలను దేశ వ్యాప్తంగా అన్ని పార్టీల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ నెల 24న జరిగే ధర్నాలో వైసిపికి చెందిన ప్రజా ప్రతినిధులంతా పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రపతి, ప్రధాని, హోంమంత్రి అపాయింట్‌మెంట్‌ కోరతామని, వారికి రాష్ట్రంలో పరిస్థితులు వివరిస్తామని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలపై చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్‌ చేశారు. ఎన్నికల్లో ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇంత వరకు ఏ ఒక్క పథకం అమలు చేయలేదని విమర్శించారు.

కాన్వాయ్‌లో వాహనాలకు ఆంక్షలు

జగన్‌ ప్రయాణిస్తున్న కాన్వాయ్‌లోకి ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులకు చెందిన వాహనాలు అనుసరించాలని ప్రయత్నించగా నరసరావుపేట వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ప్రజా ప్రతినిధులుంటేనే వాహనం అనుమతిస్తామని, వారు లేకుండా ఇతరులతో వెళ్లే వాహనాలను కాన్వాయ్‌లో అనుమతించబోమని అధికారులు పలుచోట్ల నిలిపివేశారు. దీనిపై వైసిపి నాయకులు మండిపడ్డారు.

బుల్లెట్‌ ప్రూఫ్‌ వాహనం దిగిన జగన్‌
రిపేర్‌లో వున్నది ఇచ్చారన్న వైసిపి...
కండీషన్‌లోనే వుందన్న ప్రభుత్వం

జగన్‌ వినుకొండ పర్యటనకు వెళుతూ మంగళగిరి సమీపంలో ప్రభుత్వం సమకూర్చిన బుల్లెట్‌ ప్రూఫ్‌ వాహనం దిగి మరో వాహనంలోకి మారడం చర్చనీయాంశమైంది. జగన్‌కు రాష్ట్ర ప్రభుత్వం భద్రతను తగ్గించడంతోపాటు వినుకొండ వెళ్లే వరకు కాన్వాయ్‌ వెంట వున్న నాయకుల వాహనాలను నిలిపేయడం ఏమిటని వైసిపి శ్రేణులు ప్రశ్నించాయి. రిపేర్‌లో ఉన్న పాత బుల్లెట్‌ ప్రూఫ్‌ వాహనం ఇవ్వడంతో మార్గంలో పలుమార్లు వాహనం మొరాయించిందని, అందుకే మారారని వైసిపి శ్రేణులు చెబుతుండగా, బుల్లెట్‌ ప్రూఫ్‌ వాహనం కండీషన్‌లో లేకుంటే జగన్‌ కాన్వాయ్‌లో వినుకొండ వరకు ఆ వాహనం ఎలా వెళ్తుందని ప్రభుత్వ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఫిట్‌నెస్‌తో ఉందని కండిషన్‌ చూసిన తర్వాతే విఐపికి కేటాయించామని అధికారులు చెబుతున్నారు. జగన్‌ వెంట వచ్చిన వాహనాలు నిలిపేశారనే ప్రచారాన్ని కొట్టిపారేశారు. ర్యాలీలు, సభలకు అనుమతి లేదని, జగన్‌ వెళ్లే పరామర్శ కార్యక్రమానికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. నిబంధనల ప్రకారం వైఎస్‌ జగన్‌కు భద్రత కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

22నుంచి అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)

సుమారు ఐదు రోజుల పాటు జరిగే అవకాశం ఉందన్నారు. గతంలో అసెంబ్లీ సమావేశాల సమయంలో గ్యాలరీల్లో ప్లకార్డులతో కొంతమంది ప్రవేశించిన సంఘటనలు చూశామని, అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. ఈ సమావేశం తరువాత అసెంబ్లీ సమావేశాల నిర్వహణ గురించి శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ మరో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు జవాబుదారీగా వ్యవహరిస్తూ, సభా సాంప్రదాయాలు పాటిస్తూ, సభా గౌరవం నిలబెట్టేలా సమావేశాలు నిర్వహించాలన్నారు. సిఎస్‌ నీరబ్‌కుమార్‌ ప్రసాద్‌ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలను సజావుగా నిర్వహించేందుకు అధికారయంత్రాంగం పూర్తిగా సహకరిస్తుందన్నారు. సమావేశాలు ముగిసే వరకు అధికారులు, సంబంధిత శాఖల మంత్రులకు అందు బాటులో ఉంటారని చెప్పారు. ఈ సమావేశంలో అసెంబ్లీ సెక్రటరీ జనరల్‌ ప్రసన్నకుమార్‌ సూర్యదేవర, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, అసెంబ్లీ జాయింట్‌ సెక్రటరీ ఎం.విజయరాజు, శాంతిభద్రతల ఐజి శ్రీకాంత్‌, గుంటూరు రేంజ్‌ఐజి సర్వశ్రేష్టత్రిపాఠి, గుంటూరు ఎస్‌పి సతీష్‌కుమార్‌, ఎస్‌పిఎఫ్‌ ఎస్‌పి శంకర్‌రావు, గుంటూరు అదనపు ఎస్‌పి శ్రీనివాసరావు, విజయవాడ డిసిపి చక్రవరి, సచివాలయ చీఫ్‌ సెక్యూరిటీ అధికారి కె.కృష్ణమూర్తి భద్రయ్య పాల్గొన్నారు.

మతోన్మాద శక్తులపై నిరంతర పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

రూపాయలు రాయితీ కల్పిస్తున్నాయన్నారు. త్వరలో సిపిఎం మహాసభ జరగనుందని, ఇందులో భవిష్యత్తు కార్యాచరణ కార్యక్రమాలు రూపొందిస్తామని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పోరాడుతామని చెప్పారు.

పూర్వ కమ్యూనిస్టుల కుటుంబాల సమ్మేళన

పుట్టపర్తి విమానాశ్రయం ఎదురుగాగల సిపిఎం కార్మిక కర్షక భవనంలో పూర్వ కమ్యూనిస్టు కుటుంబాల సమ్మేళనం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కమ్యూనిస్టులకు, ఉద్యమకారులకు పుట్టపర్తి పోరాటాల గడ్డ అని పేర్కొన్నారు. గణేనాయక్‌, బుక్కపట్నం నాగమ్మ, సి ముత్యాలప్ప, మలసాని గంగులప్ప, కామ్రేడ్‌ హిమాంసాబ్‌ ఇలా ఎంతోమంది ఉద్యమ నాయకులకు ఇది పుట్టినిల్లని గుర్తు చేశారు. వీరు ఎలాంటి స్వార్థమూ లేకుండా ప్రజాసేవకే అంకితమై జీవించారని, నేటి ఉద్యమానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారని వివరించారు. కార్మికులకు, కర్షకులకు న్యాయం జరగాలంటే సిపిఎం అధికారంలోకి రావాలన్నారు.

అవయవ దాతలకు 'రైల్వే'లో 42 రోజుల ప్రత్యేక సెలవు

న్యూఢిల్లీ : అవయవ దానం చేసిన రైల్వే ఉద్యోగులకు 42 రోజుల ప్రత్యేక క్యాజువల్‌ లీవ్‌ మంజూరు చేయనున్నారు. అవయవ దానం కోసం చేసిన శస్త్రచికిత్సతో సంబంధం లేకుండా ఈ సెలవుల్ని ఇవ్వనున్నారు. గతవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో రైల్వే బోర్డు ఈ వివరాలను పేర్కొంది. అవయవ దానం మరొకరికి ప్రాణం పోసే గొప్ప కార్యక్రమంగా బోర్డు పేర్కొంది. గత ఏడాదిలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖతో సంప్రదింపులు జరిగిన తరువాత డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ పర్సనల్‌ అండ్‌ ట్రైనింగ్‌ శాఖ చేసిన సూచనలను అనుసరించి రైల్వే బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది.



మీకోసం

లవంగం పొడిని గుడ్డలో చుట్టి వాసన పీలుస్తూ ఉంటే తలనొప్పి తగ్గుతుంది.

జీవన సౌరభం

విమర్శిస్తున్నారని, విఫలమయ్యామని ప్రయత్నాలు ఆపేసి ఉంటే ఇన్ని అద్భుతాలు సాధించేవాళ్లం కాదు.

మనుమని ప్రశ్నలు.. తాతయ్య బేజారు..!



'రాజూ.. ఇలా రారా..' అంటూ ఆప్యాయంగా పిలిచాడు తాతయ్య రాఘవయ్య.

బిక్కు బిక్కుమంటూ రెండు చేతుల్లో ఉన్న భారమైన సంచులతో తాతయ్య దగ్గరకు వచ్చాడు రాజు. తనకు తెలుసు తాతయ్య మళ్ళీ ఈరోజు గూడా ఈ ప్లాస్టిక్ సంచుల గురించి అడుగుతాడని. తాతయ్య పదే పదే చెబుతూ ఉంటాడు. ప్లాస్టిక్ సంచులు వాడొద్దని. మరి తనకేమో బజార్లో ప్లాస్టిక్ సంచులు తప్ప మరేవీ కనిపించవు. ఈ విషయంపై తాతయ్యని అడుగుదామని ముందే అనుకున్నాడు.

అనుకున్నట్లుగానే, 'రాజూ మళ్ళీ ఈ ప్లాస్టిక్ సంచులేంట్రా? ఎంత చెప్పినా మీరు వినరు గాక వినరు. మా కాలంలో ఇవి లేనే లేవు. ఎంచక్కా ఇంట్లోనే పాత బట్టలతో సంచులు కుట్టుకుని సరుకులకు వెళ్ళేవాళ్ళం' అన్నాడు తాతయ్య.

'అవునా తాతయ్యా, మరి, మీ కాలంలో లేని ఈ ప్లాస్టిక్ సంచులు ఇప్పుడు ఎలా వచ్చాయి? ఎవరు తయారు చేస్తున్నారు?' అని అడిగాడు రాజు.

'పెద్ద పెద్ద కర్మాగారాలు తయారు చేస్తాయి' అన్నాడు తాతయ్య.


'కర్మాగారాలు దొంగతనంగా తయారు చేస్తున్నాయా? లేక ప్రభుత్వ అనుమతితోనా?' అన్నాడు గడుగ్గాయి రాజు.

'ప్రభుత్వ అనుమతి తీసుకునే తయారు చేస్తారు" అన్నాడు తాతయ్య .'ప్రభుత్వం ఎందుకు అనుమతి ఇస్తోంది తాతయ్యా.. ఒకపక్క ప్లాస్టిక్ సంచులు వాడొద్దని చెబుతోంది. జనాలకు ప్లాస్టిక్ సంచులు వాడొద్దని చెప్పడానికి బదులు అసలు ఆ ఫ్యాక్టరీలను మూసేయిస్తే సరి కదా! బట్ట సంచులు లేదా కాగితపు సంచులు తయారు చేసే ఫ్యాక్టరీలకు మాత్రమే అనుమతి ఇవ్వాలి కదా తాతయ్యా' అంటూ కళ్ళు ఎగరేసాడు రాజు.

నిజమే అన్నట్టు ఆలోచనలో పడిపోయాడు రాఘవయ్య. 'పుండు ఒక దగ్గర.. మందు మరో దగ్గర' అన్నట్టు ఉంది ప్రభుత్వ వ్యవహారం. ప్రశ్నలతో తనను బేజారు చేసిన మనవని తెలివి తేటలకు అబ్బురపడి రాజును హృదయానికి హత్తుకున్నాడు రాఘవయ్య.

– చెన్నూరి సుదర్శన్,
94405 58748.

B	Q	D	A	S	W	L	O	O	M	P
A	I	S	P	R	I	N	G	H	S	U
P	C	R	W	A	B	Y	A	P	H	D
R	F	Z	X	I	G	S	H	O	O	D
I	V	D	U	N	N	U	I	Z	W	L
L	I	R	A	I	S	O	Q	S	E	E
R	A	B	I	R	D	S	A	B	R	S
B	L	O	O	M	Q	L	I	H	S	Z
S	P	F	L	O	W	E	R	D	D	L



April, Spring, Rain, Showers, Birds, Bloom, Puddles, Flower

పదాలు గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బాక్సులో చాలా ఆంగ్ల అక్షరాలు ఉన్నాయి కదా! వాటిల్లో కింద ఇచ్చిన ఆంగ్ల పదాలు ఉన్నాయి. ఎక్కడున్నాయో కనిపెట్టండి చూద్దాం!

నేను గీసిన బొమ్మ





డి.అర్చన,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
హవేలీ ఘనపూర్, మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఒలింపిక్స్ చరిత్రలో బిల్కిస్ చెరగని ముద్ర..

'ఇలాంటి ప్రాంతంలో ఆడపిల్ల మనుగడే కష్టం. అలాంటిది ఎలా ఆటలు ఆడుతుంది? పైగా ఈ పిల్ల ఒక్కత్తే కాక, ఇతర ఆడపిల్లలను కూడా చెడగొడుతోంది' అన్న ఈసడింపు మాటల మధ్యే ఉన్నత లక్ష్యాలు చేరుకుంది కాశ్మీర్‌కి చెందిన వాటర్ స్పోర్ట్స్ క్రీడాకారిణి బిల్కిస్ మీర్. జులై 26 నుండి పారిస్‌లో జరిగే ఒలింపిక్స్ పోటీల్లో గెలుపోటములను నిర్ణయించే నిర్ణయాధికారిగా ఆమె నియమితమైంది. దేశం తరపున ఈ హోదాలో కాశ్మీర్ నుంచి బయలుదేరిన ప్రథమ మహిళ మీర్.



ఆరు నెలల క్రితం ఈ విషయం ప్రకటించారు. 'పారిస్ ఒలింపిక్స్‌లో జ్యూరీ మెంబర్‌గా నియమితమైన మొదటి మహిళ' అని అందరూ నన్ను ప్రశంసిస్తుంటే చాలా సంతోషంగా ఉంది. ఈ పాత్ర పోషించడం వెనుక ఎన్నో అవమానాలు, కష్టాలు ఉన్నాయి. ఇప్పుడు అవన్నీ దూదిపింజల్లా ఎగిరిపోయాయి. క్రీడాకారిణిగా ఒలింపిక్స్‌లో అడుగుపెట్టలేకపోయాను. కానీ జడ్జ్‌గా వెళుతున్నాను. ఇప్పుడు నా బాధ్యత మరింత పెరిగింది. దేశం పేరును ఉన్నత స్థానంలో నిలబెట్టే అత్యున్నత హోదా ఇది' అని మీర్ తన సంతోషాన్ని ఈ సందర్భంగా పంచుకున్నారు.

బాక్సర్ కావాలనుకుని..

బాల్యం నుండి బాక్సర్ కావాలని కలలుకన్న మీర్ ఇంటి ముందున్న చెట్లను అదేపనిగా కొడుతూ ఉండేది. పిడికిలి బిగించి ఆ పిల్ల ఇచ్చే పంచులకు తల్లిదండ్రులు తెగ సంతోషపడేవారు. అయితే ఏడేళ్ల వయసులో మీర్ దృష్టి వాటర్ స్పోర్ట్స్‌వైపు మళ్లింది. దాల్ సరస్సులో నిర్వహిస్తున్న వాటర్ స్పోర్ట్స్‌కి స్నేహితులతో కలసి వెళ్లిన మీర్‌కి అనుకోకుండా ఒక అవకాశం వచ్చింది. అరుస్తూ, కేరింతలు కొడుతూ ఎంతో ఉత్సాహంగా ఆటను చూస్తున్న మీర్ దగ్గరకు ఆటలో పాల్గొనమని కోచ్ సలహా ఇచ్చారు. అవకాశం రావడమే ఆలస్యం, మీర్ ఒక్క ఉదుటున పడవలోకి దూకేసింది. 'ఆ రోజు నాకు చాలా భయమేసింది. పడవను అదుపులో పెట్టడం చాలా కష్టమనిపించింది. అయినా కోచ్ ఇచ్చిన ధైర్యంతో ముందుకు నడిపాను. ఆ రోజు నాకు ఇప్పటికీ గుర్తు ఉంది. తడిసిన బట్టలతో ఇల్లు చేరిన నన్ను అమ్మానాన్న బాగా తిట్టారు. ఆనాటి సమాజంలో ఆడపిల్ల చదువుకోవడమే గొప్ప. ఇక ఆటలంటే అసలే కుదరవు. ఆటల శిక్షణ కోసం స్కూలు మానేయాల్సి వచ్చేది. అయినా వెనుకడుగు వేయలేదు. మొట్టమొదటిసారి 1997లో ఒక టోర్నమెంట్‌లో పాల్గొని పతకం సాధించాను. ఏదేని లక్ష్యంపెట్టుకుని ముందుకు వెళ్లాలంటే ఆడపిల్ల ముందు తన ఇంటిని దాటాలి. మొదటి ప్రతిబంధకాలు అక్కడి నుండే మొదలవుతాయి. నేను సాధించిన విజయాల పట్ల అమ్మానాన్న సంతోషంగా ఉన్నా, చాలా కోపంగా ఉండేవారు. వాళ్లకి అర్థమయ్యేలా చెప్పడానికి నాకు 15 రోజులు పట్టింది' అని నాటి సంగతులు మీర్ గుర్తు చేసుకున్నారు.

రెండు ఆటల్లోనూ..

వాటర్‌స్పోర్ట్స్‌లో 'కెనోయింగ్', 'కయాకింగ్' చాలా ప్రత్యేకమైనవి. కష్టమైనవి. ఎంతో నైపుణ్యం ప్రదర్శించాల్సిన ఈ క్రీడల్లో మీర్ ఉన్నత ప్రతిభ చూపేది. జమ్మూకాశ్మీర్ తరపున 12 జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించింది. క్రీడాకారులు ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే ఐసిఎఫ్ స్ప్రింట్ రేసింగ్ వరల్డ్ కప్‌లో పోటీచేసి దేశ ప్రతిష్టని మరింత ఇనుమడింపజేసింది. 2007 నుండి 2008 వరకు ఆసియన్ ఛాంపియన్‌షిప్‌కి ఇండియా తరపున ప్రాతినిధ్యం వహించింది. 2007 నుండి 2013 వరకు దేశ వ్యాప్తంగా విస్తృత పర్యటనలు చేసి కనోయింగ్, కయాకింగ్ క్రీడల్లో క్రీడాకారులకు శిక్షణ ఇచ్చింది. 2011లోనే ఈ రెండు క్రీడల్లో రాణిస్తున్న మహిళా క్రీడాకారులకు ప్రధాన కోచ్‌గా నియమితమైంది.



ఆటను వదిలేద్దమనుకున్నా..

'నా కెరీర్‌లో నేను ఎన్నో ఎత్తుపల్లాలను చూశాను. ఇప్పుడు వచ్చే యువ క్రీడాకారులు ఆ కష్టాలు పడకుండా పైకి ఎదగాలని నా వంతు సాయం చేస్తున్నాను. పురుషుల బృందానికి కోచ్‌గా నన్ను నియమించినప్పుడు ఎన్నో అవమానాలు పడ్డాను. ఆటను వదిలిపెట్టి వెళ్లిపోవాలన్నంత బాధ అనుభవించాను. అప్పుడు అమ్మే నాకు అండగా నిలబడింది. క్రీడల్లో రాణించే ఏ క్రీడాకారిణికైనా ఇలాంటి పరిస్థితి ఒకటి వస్తుంది. ఆ సమయంలోనే ఆమె మరింత ధైర్యంగా ఉండాలి. తనపై నమ్మకాన్ని కోల్పోతున్న వేళ, తనని బలపరిచే వారు ఒకరు తోడుండాలి. అమ్మ నాకు ఆ మద్దతు ఇచ్చింది.

ఒక్కో మెట్టు ఎక్కుతూ..

2020 నాటికి మీర్ మరో మెట్టు పైకి ఎదిగింది. ఇండోనేషియాలో జరిగే 18వ ఆసియన్ గేమ్స్ కెనోయ్ స్ప్రింట్‌కి న్యాయనిర్ణేతగా ఆసియన్ కెనోయ్ ఫెడరేషన్ మీర్‌ని ఎంపికచేసింది. అంతేకాదు, 2023 సెప్టెంబరులో చైనాలో జరిగిన 19వ ఆసియన్ గేమ్స్‌కు జ్యూరీ మెంబర్‌గా సెలక్ట్ అయ్యింది. ఆమె నేతృత్వంలో వందకి పైగా క్రీడాకారులు తర్ఫీదుపొందారు. పతకాలు సాధించారు.

'కాశ్మీర్ పేరు చెడగొడుతున్నా' అన్నారు..

కాశ్మీర్ పేరు చెడగొడుతున్నావని నా చుట్టూ ఉన్న వాళ్లు గేలి అవమానించారు. అప్పుడు నేను వెనకడుగు వేస్తే, నేను మాత్రమే ఓడిపోయినట్లు కాదని అమ్మ చెప్పింది. కలలను సాకారం చేసుకోవాలని ఎన్నో కష్టాలు పడుతున్న ఆడపిల్లలందరూ ఓడిపోయినట్లే అంది. నేను గెలిచి, వాళ్లని గెలిపించాలని చెప్పింది. ఆటలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించే వనరులు అప్పట్లో లేవు. బయట నుండి ఏవిధమైన ప్రోత్సాహం లేదు. రోల్ మోడల్స్ లేరు.. ఈ కారణాలతోనే క్రీడాకారిణిగా ఒలింపిక్స్‌లోకి అడుగుపెట్టలేకపోయాను. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. క్రీడల్లో మహిళలు రాణిస్తున్నారు, విభిన్న రకాల క్రీడలను ఎంచుకుంటున్నారు. బహుశా ఈ వాతావరణమే మరోసారి నన్ను జడ్జ్‌గా నియమితమయ్యేలా చేసిందేమో!" అంటూ మీర్ చెబుతున్నప్పుడు ఆమె కళ్లల్లో ఆనందభాష్పాలు కనిపించాయి.

'ఏదైనా సాధించాలి అని లక్ష్యం పెట్టుకున్నప్పుడు దాన్ని పొందేవరకు పోరాడాలి. ఉజ్వల భవిష్యత్తును సృష్టించుకునేందుకు వదలకుండా పోరాడేవారే విజయం సాధిస్తారు. అందుకోసం వారు ఎన్నో సౌకర్యాలను, సౌలభ్యాలను వదులుకోవడానికి కూడా సిద్ధంగా ఉండాలి' అని మీర్ చెబుతున్నారు.

వణికిన వేలేరుపాడు

(మొదటిపేజీ తరువాయి)

చేరింది. దీంతో, అధికారులు ఆలయంలో అమ్మవారి దర్శనాలు నిలిపివేశారు. వరద నీరు చేరడంతో పోచమ్మ గండిలోని 40 కుటుంబాలు పురుషోత్తం గ్రామానికి వెళ్లిపోయాయి. పోచమ్మ గండి-దండింగి మధ్య రహదారులన్నీ పూర్తిగా జలమయమయ్యాయి. పాపికొండల పర్యాటక బోట్లను ఆపేశారు. పర్యాటకులు, భక్తులు ఎవరూ నది ప్రాంగణం వైపు వెళ్లొదంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. రాజవొమ్మంగి మండలం మడేరు, ఒట్టిగడ్డ, కింద్ర పెద్దేరు, లబ్బర్తి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఒట్టిగడ్డ వాగు ప్రధాన రహదారిపై సుమారు నాలుగు అడుగులు ఎత్తులో ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. డుంబ్రిగుడ మండలం గత్తరజిల్లేడ సమీపంలోని కొర్రాయి వంతెనపై నుంచి వరద నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముంచంగిపుట్టు మండలం లక్ష్మీపురం, బరడా, వనుగుమ్మ, బూసిపుట్టు, బుంగపుట్టు, కుమడ బాబుశాల తదితర పంచాయతీలకు వరదల కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి.

ఇద్దరు గల్లంతు ...

రంపచోడవరం మండలం పాత సీతపల్లి గ్రామ సమీపంలోని వాగులో ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. బి.వెలమలకోట గ్రామానికి చెందిన కొందరు సీతపల్లి గ్రామ సమీపంలోని వాగులో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు ఒకరు మునిగి గల్లంతయ్యాడు.



అల్లూరి జిల్లా దేవీపట్నంలోని గండిపోచమ్మ ఆలయంలోకి ప్రవేశించిన వరద నీరు

కోనసీమ జిల్లాలో 7 వేల ఎకరాల్లో వరి నారుమళ్లు మునక

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు ఏడు వేల ఎకరాల్లో వరి నారుమళ్లు నీటమునిగాయి. రామచంద్రపురం, కపిలేశ్వరపురంలో పొలాలు వర్షపు నీటితో దర్శనమిస్తున్నాయి. కాకినాడ జిల్లా తాళ్లరేవు, కాజులూరులో కురిసిన భారీ వర్షానికి పంట పొలాల్లోకి నీరు చేరింది. లోతట్టు ప్రాంతల్లో మోకాల్లోతు వర్షపు నీరు నిలిచిపోయింది. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి, నిడదవోలు, గోపాలపురం, తాళ్లపూడి, కొవ్వూరు మండలాల్లో భారీ వర్షం కురిసింది. కొవ్వాడ కాలువ పొంగడంతో వంద ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. కడియంలో నర్సరీల్లోకి వర్షపు నీరు చేరడంతో మొక్కల ఎగుమతి ఆటంకాలు కలిగాయి. విజయనగరం జిల్లాలో భారీ వర్షాలకు నువ్వు పంటకు నష్టం వాటిల్లింది.



కోనసీమ జిల్లా కపిలేశ్వరపురంలో నీట మునిగిన వరి చేను

కాటన్ బ్యారేజీ నుంచి 3.46 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల

గోదావరి నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. భద్రాచలం వద్ద శుక్రవారం సాయంత్రానికి 26.8 అడుగుల నీటిమట్టం నమోదైంది. పోలవరం ఎగువ స్పిల్‌వే వద్ద 18.5 మీటర్లు, దిగువ స్పిల్‌వే వద్ద 19 మీటర్ల నీటి మట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇక్కడి నుంచి దిగువకు 2,94,341 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఈ ఉధృతి రెండ్రోజుల పాటు కొనసాగుతుందని సిడబ్ల్యుసి అధికారులు అంచనా వేస్తున్నారు. కాటన్ బ్యారేజీ వద్ద బ్యారేజీ వద్ద 7.10 అడుగుల నీటిమట్టం నమోదైంది. 175 గేట్ల ద్వారా 3,46,391 లక్షల క్యూసెక్కులను సముద్రంలోకి విడిచి పెడుతున్నారు.

వ్యవసాయ అవసరాల నిమిత్తం తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాల్వలకు 4,700 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు.

ఎన్‌గుయెన్ ఫు ట్రాంగ్ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

అప్పగించారు.. 2026లో పార్టీ మహాసభ జరిగేవరకు ట్రాంగ్ ఆ బాధ్యతల్లో కొనసాగే వీలున్నా ఆరోగ్యం సహకరించని కారణంగా స్వచ్ఛందంగా ఆ పదవి నుంచి తప్పుకున్నారు. దేశం కోసం, ప్రజల కోసం తన యావజ్జీవితాన్ని అర్పించిన గొప్ప ప్రజా నాయకుడు ట్రాంగ్ అని ప్రస్తుత అధ్యక్షుడు లామ్ కొనియాడారు. ప్రజలతో మమేకమయ్యే తత్వం, నిరాడంబరమైన జీవన శైలి, మార్క్సిజం, లెనినిజం, హోచిమినిజం పట్ల నిబద్ధతే ఆయనను మహోన్నతుడిగా నిలబెట్టాయని అన్నారు. పార్టీలో, ప్రభుత్వంలో వ్యక్తివాదం, అవినీతి ఏ స్థాయిలో ఉన్నా వాటిపై కఠినంగా వ్యవహరించేవారని లామ్ గుర్తు చేశారు. .

రామ్‌చరణ్‌కు అరుదైన గౌరవం



హీరో రామ్‌చరణ్‌కు అరుదైన గౌరవం లభించింది. ఆస్ట్రేలియాలోని 15వ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్ ఈవెంట్‌కు ఆహ్వానం లభించింది. ఈ వేడుకల్లో గౌరవ అతిథిగా ఆయన పాల్గొనబోతున్నారు. భారతీయ సినిమాకు చేసిన కృషికి గాను ఈ వేడుకల్లో ఇండియన్ ఆర్ట్ అండ్ కల్చర్ అంబాసిడర్‌గా అవార్డు అందుకోనున్నారు. విక్టోరియన్ రాష్ట్రప్రభుత్వం ఏటా నిర్వహించే ఈ ఉత్సవాన్ని ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి 25 వరకూ నిర్వహించనున్నారు. ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటు నాటు సాంగ్స్‌కు రామ్ చరణ్, ఎన్టీఆర్ డ్యాన్స్ చేసిన విషయం తెలిసిందే. ఈ ఫిలిం ఫెస్టివల్‌లో భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గౌరవిస్తూ భారతీయ కళ, సంస్కృతికి అంబాసిడర్ అవార్డును నిర్వాహకులు రామ్‌చరణ్‌కు అందజేయనున్నారు. అంతర్జాతీయ వేదికపై జరుపుకునే ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్‌లో భాగమైనందుకు చాలా గర్వంగా ఉందని రామ్‌చరణ్ టీమ్ ఒక ప్రకటన విడుదల చేసింది.

'ట్రైన్' కోసం 'శ్రుతి' గానం

తమిళ సినీనటుడు విజయ్ సేతుపతి నటించిన చిత్రం 'ట్రైన్'. నటి డింపుల్ హైయతీ కథానాయిక. ఆర్.దయానంద, నాజర్, దర్శకుడు కెఎస్ రవికుమార్, వినయ్‌రాయ్, భావన, యోగిబాబు తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. వి క్రియేషన్స్ పతాకంపై కలైపులి ఎస్.థాను నిర్మిస్తున్నారు. మిష్కిన్ దర్శకత్వంతోపాటుగా సంగీతాన్ని అందిస్తు న్నారు. ఈ చిత్రంలో నాలుగు పాటలున్నాయి. అందులో ఒక పాటను మిష్కిన్ పాడారు. మరో పాటను శ్రుతిహాసన్ పాడటానికి అంగీకరించారు.

దీప్తి స్పిన్ మాయాజాలం

- పాకిస్తాన్‌పై ఏడు వికెట్ల తేడాతో టీమిండియా విజయం
- ఆసియాకప్ మహిళల క్రికెట్



దంబుల్లా(శ్రీలంక): శ్రీలంక వేదికగా జరుగుతున్న ఆసియాకప్ మహిళల క్రికెట్‌లో భారతజట్టు బోణీ కొట్టింది. గ్రూప్-ఎ శుక్రవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 7వికెట్ల తేడాతో పాకిస్తాన్‌పై ఘన విజయం సాధించింది. తొలుత స్పిన్నర్ దీప్తి శర్మ(3/20)కి తోడు రేణుకా సింగ్ (2/14), పూజా వస్త్రాకర్(2/31), శ్రేయాంక(2/14) రాణించడంతో పాకిస్తాన్ జట్టును కేవలం 108పరుగులకే పరిమి తం చేసింది. ఆ లక్ష్యాన్ని భారత్ 14.1ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి సునాయాసంగా గెలిచింది. ఛేదనలో భాగంగా టీమిండియా ఓపెనర్లు షెఫాలీ వర్మ(40; 29బంతుల్లో 6ఫోర్లు, సిక్సర్), మంధాన(45; 31బంతుల్లో 9ఫోర్లు) తొలి వికెట్‌కు 9.1ఓవర్లలో 85పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత హేమలత(14) స్వల్ప స్కోర్‌కే ఔటైనా.. హర్మన్‌ప్రీత్(5), రోడ్రిగ్స్(3) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు.

తొలుత భారత్ పేసర్ పూజా వస్త్రాకర్ ఆదిలోనే బ్రేక్ ఇచ్చింది. గుల్ ఫెరొజా(5)ను ఔట్‌చేసి వికెట్ల వేట మొదలెట్టింది. ఆ తర్వాత బౌన్సర్‌తో మునీబా అలీ(11)ను బోల్తా కొట్టించి పాక్‌ను కష్టాల్లో పడేసింది. దాంతో, పాక్ 26 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయింది. పవర్ ప్లేలోనే రెండు వికెట్లు తీసిన పూజా పాక్‌ను ఒత్తిడిలోకి నెట్టింది. ఆ దశలో సిద్రా అమీన్(25), ఆఖర్లో ఫాతిమా సనా ఫాతిమా(22 నాటౌట్) దూకుడుగా ఆడారు. 20వ ఓవర్ రెండో బంతికి సదియా ఇక్బాల్(0)ను శ్రేయాంక పాటిల్ బౌల్డ్ చేయడంతో పాకిస్తాన్ ఇన్నింగ్స్ ముగిసింది. చివర్లో సనా ఫాతిమా పోరాటంతో పాక్ స్కోర్ ఆ మాత్రం రన్స్ చేయగలిగింది. రాధా యాదవ్ వేసిన 19వ ఓవర్‌లో సనా రెండు భారీ సిక్సర్లు బాదింది. దాంతో, పాక్ స్కోర్ సెంచరీ మార్క్ దాటింది. చెలరేగడంతో పాకిస్తాన్ 108 పరుగులకే ఆలౌటయ్యింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దీప్తి శర్మకు లభించగా.. రేపు యుఏఇతో భారత్ తలపడనుంది.

తొలి మ్యాచ్‌లో నేపాల్ జట్టు ఆరు వికెట్ల తేడాతో యుఏఇపై ఘన విజయం సాధించింది. తొలుత యుఎఇ నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 115పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని నేపాల్ జట్టు 16.1ఓవర్లలోనే పూర్తిచేసింది. ఓపెనర్ సంజనా ఖడ్కా(72నాటౌట్) అర్ధసెంచరీతో రాణించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సంజనకు లభించింది.

స్కోర్‌బోర్డు...

పాకిస్తాన్ మహిళల ఇన్నింగ్స్: ఫరోజా (సి)హర్మన్‌ప్రీత్ (బి)పూజ వస్త్రాకర్ 5, మునీబా అలి (సి)రోడ్రిగ్స్ (బి)పూజ వస్త్రాకర్ 11, అమీన్ (సి)రాధా యాదవ్ (బి)రేణుక సింగ్ 25, అలియా రైజ్ (సి)రోడ్రిగ్స్ (బి)శ్రేయాంక పాటిల్ 6, నిదా దార్ (సి)హేమలత (బి)దీప్తి శర్మ 8, తుబా హసన్ (సి)రాధా యాదవ్ (బి)దీప్తి శర్మ 22, జావెద్ (ఎల్‌బి)రేణుకా సింగ్ 0, ఫాతిమా సనా (నాటౌట్) 22, అరుబ్ షా (రనౌట్) రాధా యాదవ్ 2, నిష్రా సంధు (సి)రీచా (బి)దీప్తి 0, సదియా ఇక్బాల్ (బి)శ్రేయాంక పాటిల్ 0, అదనం 7. (19.2ఓవర్లలో ఆలౌట్) 108పరుగులు. **వికెట్ల పతనం:** 1/9, 2/26, 3/41, 4/59, 5/61, 6/61, 7/92, 8/94, 9/94, 10/108 **బౌలింగ్:** రేణుకా సింగ్ 4-0-14-2, పూజ వస్త్రాకర్ 4-0-31-2, దీప్తి శర్మ 4-0-20-3, రాధా యాదవ్ 4-0-26-0, శ్రేయాంక పాటిల్ 3.2-0-14-2.

భారత మహిళల ఇన్నింగ్స్: షెఫాలీ వర్మ (బి)సైదా అరోబ్ 40, మంధాన (సి)రైజ్ (బి)సైదా అరోబ్ 48, హేమలత (సి)తుబా హసన్ (బి)సద్రా సంధు 14, హర్మన్‌ప్రీత్ కౌర్ (నాటౌట్) 5, రోడ్రిగ్స్ (నాటౌట్) 3, అదనం 2. (14.1ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 109పరుగులు. **వికెట్ల పతనం:** 1/85, 2/100, 3/102 **బౌలింగ్:** సదియా 2.1-0-18-0, ఫాతిమా 2-0-15-0, నిదా ధార్ 1-0-10-0, తుబా 2-0-36-0, నిద్రా సద్ధు 4-0-20-1, సైదా అరోబ్ 3-0-9-2.

ఒలింపిక్స్‌లో సత్తా చాటినా తృటిలో పతకం చేజారే...

ఒలింపిక్స్ చరిత్రలో భారత అథ్లెట్లు పతకానికి చేరువగా వచ్చి నాల్గోస్థానం సరిపుచ్చుకొన్న అథ్లెట్ల ఆవేదన వర్ణణాతీతం. మెల్‌బోర్న్(1956) నుంచి టోక్యో (2020) ఒలింపిక్స్ వరకు ఎందరో ఆథ్లెట్లు నాల్గోస్థానంతో సరిపుచ్చుకున్నా.. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆ వరుసలో నెవెల్లె డిసౌజా(ఫుట్‌బాల్) ముందుండగా.. భారత మహిళల హాకీ జట్టు చివర్లో ఉంది.

మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు అప్రతిహాత విజయాలతో నాకౌట్ దశకు చేరింది. క్వార్టర్‌ఫైనల్లో ఏకంగా ఆతిథ్య ఆస్ట్రేలియాపై 4-2గోల్స్‌తో సంచలన విజయం సాధించిన సెమీస్‌కు చేరింది. ఆస్ట్రేలియాపై డిసౌజా హ్యాట్రిక్ గోల్స్‌తో మెరిసి భారతజట్టు గెలుపులో కీలకపాత్ర పోషించాడు. అదే ఊపులో సెమీస్‌లో గెలిస్తే ఇక పతకం ఖాయం అనుకున్న దశలో అనూహ్యంగా యుగోస్లేవియా చేతిలో 4-1గోల్స్‌తో ఓటమిపాలయ్యారు. ఈ క్రమంలోనే కాంస్య పతక పోటీలోనూ బల్గేరియా చేతిలో 3-0తో ఓడి పతకానికి దూరంగా నిలిచిపోయారు. ఆ తర్వాత ఒలింపిక్స్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు ఆ స్థాయి ప్రదర్శనను కనబర్చిన దాఖలాలు లేవు.

1960 రోమ్ ఒలింపిక్స్..

భారత లెజెండ్ అథ్లెట్ మిల్కా సింగ్ 400మీ. పరుగులో ఫైనల్లోకి దూసుకొచ్చాడు. 'ది ఫ్లైయింగ్ సిక్'గా పేరుగాంచిన మిల్కా సింగ్ ఫైనల్లో 0.01సెకన్ల వ్యత్యాసంతో నాల్గోస్థానానికే పరిమితమయ్యాడు. ఫైనల్లో మిల్కా సింగ్ 45.73సెకన్లలో గమ్యానికి చేరి రికార్డు పుటల్లోకెక్కాడు. ఈ రికార్డు 60ఏళ్లు పదిలంగా ఉండగా.. 2019లో మహ్మద్ అనాస్ యహియా (45.21సెకన్లు) మిల్కాసింగ్ రికార్డును బ్రేక్ చేశాడు.

1980 మాస్కో ఒలింపిక్స్..

ఆఫ్ఘనిస్తాన్‌పై దాడి కారణంగా 1980 మాస్కో ఒలింపిక్స్‌ను గ్రేట్ బ్రిటన్ బాయ్‌కాట్ చేసింది. దీంతో భారత మహిళల హాకీ జట్టుకు ఆ ఒలింపిక్స్‌లో ఆడే ఛాన్స్ దక్కింది. ఒలింపిక్స్‌లో భారత మహిళల హాకీ జట్టు ప్రాతినిధ్యం వహించడం అదే తొలిసారి. ఆ ఒలింపిక్స్‌లో భారత జట్టు జింబాబ్వే, చెక్ రిపబ్లిక్‌లను చిత్తుచేసి గెలిచి సెమీస్‌కు చేరింది. సెమీస్‌లో గెలిస్తే పతకం ఖాయం అనుకున్న దశలో 1-3తో సోవియట్ రష్యా చేతిలో ఓడింది.

1984 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్..

మిల్కా సింగ్ తర్వాత రన్నింగ్‌లో అంతటి పేరు ప్రఖ్యాతలు సంపాదించింది పిటి ఉష మాత్రమే. 1984 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో పిటి ఉష 400మీ. హార్డిల్స్‌లో ప్రాతినిధ్యం వహించి ఫైనల్లో 1/100 సెకన్ల తేడాతో కాంస్య పతకాన్ని చేజార్చుకుంది. ఆ తర్వాత మరే మహిళా అథ్లెట్ ఆ స్థాయి ప్రదర్శనను కనబర్చలేదు. మరికొన్ని వివరాలు రేపటి సంచికలో..– స్పోర్ట్స్ డెస్క్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68